జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7   సంచిక - 01   పక్షపత్రిక   జనవరి 1-15, 2016



## మురికి మూసీ పాత రాజకీయమా?
## లోక్‌సత్తా 'వార్డు ప్రభుత్వ హైదరాబాద్' కొత్త రాజకీయమా?



వాళ్లు వివేకానందుని మతస్థులు కారు



జేపీ యువ మంత్రాలు

# ప్రజల భాగస్వామ్యంతో రుద్రంపేట, అనంతపురం 50వ వార్డు అభివృద్ధి చేస్తా: జేపీ


జేపీ రుద్రంపేట, అనంతపురం 50వ వార్డు పర్యటన

స్థానిక సాధికారత ఉంటే ప్రజల శక్తిసామర్థ్యాలు వికసించి ఎలా అభివృద్ధిని సాధిస్తారో ఒక నమూనాగా తెలియచేసేందుకే అనంతపురం జిల్లాలోని రుద్రంపేట గ్రామాన్ని, పట్టణంలోని 50వ వార్డుని దత్తత తీసుకున్నానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజల సహాయ సహకారాలతోనే తాను ఈ గ్రామం, వార్డు అభివృద్ధి చేస్తానన్నారు. జయప్రకాష్ నారాయణ్ దత్తత తీసుకున్నాడు, ఇక అన్ని విధాలా అభివృద్ధి చేస్తాడులే అనే భావనను ప్రతి ఒక్కరూ తొలగించుకుని కులం, మతం, ప్రాంతం, పార్టీల కతీతంగా చేయూతనందిస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. దత్తత గ్రామమైన అనంతపురం రూరల్ మండలంలోని రుద్రంపేటలోని చంద్రబాబు నగర్, పంతుల కాలనీ, వికాస్‌నగర్ కాలనీ, విమలాఫారూక్ నగర్, వికలాంగుల కాలనీల్లో సర్పంచ్ కాలే నాయక్‌తో కలిసి జేపీ పర్యటించారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్నా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని, మరుగుదొడ్లు లేవని, తాగునీటిలో ఫ్లోరైడ్ సమస్య గురించి పలువురు మహిళలు ఆయనతో వాపోయారు. పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తానని జేపీ తెలిపారు. మొదట గ్రామ పంచాయతీలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ప్రజలకు మంచి వైద్యాన్ని అందించటం ధ్యేయంగా కృషి ప్రారంభిస్తామన్నారు. పేదలకు బతుకు, ధైర్యం చదువుతోనే సాధ్యమవుతాయని, ఇక్కడ మధ్యలోనే చదువు ఆపటం, అందుతున్న చదువు అధ్వాన్నంగా ఉండటం పెద్ద సమస్యలుగా ఉన్నాయన్నారు. యువత ఉపాధికి శిక్షణాకార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల్ని అర్థించేవారుగా సమాజం తయారుచేసిందని, అర్థించటం కాకుండా ప్రజలు తమ సమస్యలను తామే పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని అనంతపురం పట్టణంలోని 50వ వార్డులో పాదయాత్ర సందర్భంగా ప్రజలకు సూచించారు. వెనకబాటుతనంతో రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన ప్రాంతం కాబట్టి తాను ఈ ప్రాంత ప్రజలకు మానసిక స్థైర్యం ఇవ్వటం కోసం తొలుత అత్యంత వెనకబడిన అనంతపురం జిల్లాలో దత్తత తీసుకున్నానని, త్వరలో ఉత్తరాంధ్ర తెలంగాణల్లో కూడా వెనకబడిన గ్రామాలను దత్తత తీసుకుని ఇదే నమూనాలో అభివృద్ధి చేస్తానని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు వేలూరి అశోక్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ వేణుగోపాల్, ఎంపీడీవో ఓబులమ్మ, ఎంపీటీసీ రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిష్టప్ప, విద్యార్థి సత్తా జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్, అమ్మానాన్న సొసైటీ వ్యవస్థాపకుడు బాబు, డీఈవో అంజయ్య, కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభాకర్, జిలాన్, లక్ష్మీనారాయణ, ఫయాజ్ బాషా, గోవింద రెడ్డి, అనంతయ్య, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, పలువురు విద్యార్థులు, మండల అధికారులు, 50వ వార్డు కార్పొరేటర్ బిందుప్రియ, అదనపు కమిషనర్ కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ శేఖర్‌బాబు, వీకే రంగారెడ్డి, జక్రియ తదితరులు పాల్గొన్నారు.



ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అడ్మినిస్ట్రేటివ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారులతో జేపీ. 'ఐపీఎస్-పరిపాలన' అంశంపై వారినుద్దేశించి జేపీ ప్రసంగించారు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 1

## లోపలి పేజీల్లో...

బస్తీలు, కాలనీలకు నేరుగా నిధులు .............................. 5
మురికి మూసీ పాత రాజకీయమా?.............................. 6
లోక్‌సత్తా వినూత్న ఆందోళన........................................ 10
జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల నిర్వాకంతో......................... 11
హైదరాబాద్‌లో హోర్డింగ్‌ల్ని కబ్జాచేసిన టీఆర్ఎస్...... 13
కోదాడలో హాస్టళ్ల తీరుపై లోక్‌సత్తా ధ్వజం.................. 13
పక్కాసొంతిల్లు పాలసీని రూపొందించాలి లోక్‌సత్తా .14
జన చైతన్య యాత్రల వల్ల ఏం ఒరిగింది....................... 15
కార్పొరేటర్ల ప్లేటు భోజనం రూ. 2000/-.................. 16
ప్రక్షాళన లేని అరెస్టులు, విచారణలు నాటకాలే : జేపీ.... 17
నిర్భయ చట్టం అమలు అరకొర, నిధి ......................... 19
న్యాయానికి అడ్డుపడటం, దిగజారి మాట్లాడటం......... 20
వరద బాధితుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వం................ 20
కులమత వివక్ష, విద్వేషం చూపేవారు వివేకానందుని.. 21
చదువిట్లా... ఇక మీరు చెబుతున్న అభివృద్ధి ఎట్లా....... 24
ప్రజల్ని పౌరులుగా తయారుచేయటానికి భారత....... 25
డబ్బు ప్రవాహాన్ని ఆపకపోతే మున్ముందు...................... 27
ప్రతిభ గలవారిని రాజకీయాల్లో ప్రోత్సహించాలి......... 27
ఐదేళ్లలో రూ.50,000 కోట్ల మేతుకు కుంభకోణం.... 28
హరిత విప్లవ రాష్ట్రంలో బద్దలవటానికి సిద్ధంగా ......... 29
ఇవే యువ మంత్రాలు.................................................. 30
పొంతనలేని కార్పొరేటర్ల ఎన్నికల ఖర్చు, అనర్హత ...... 34
రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : లోక్‌సత్తా ................ 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

## సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# మన వార్డు, మన నగరం ఆ తర్వాతే రాష్ట్రం, దేశం



హైదరాబాద్ ప్రజలకు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కన్నా కీలకమైన మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగబోతున్నాయి. మన రోజువారీ జీవితంలో దాదాపు 80శాతం ఈ స్థానిక పాలనతోనే ముడిపడివుంటుంది. తాగునీరు, మురుగునీటి పారుదల, రోడ్లు, వీధిదీపాలు, కాలనీలు, బస్తీల్లో భద్రత, ధ్రువపత్రాలు, విద్యుత్తు కనెక్షన్లు వంటి అంశాలన్నిటిలో మనకు లంచాలు లేకుండా, సకాలంలో సేవలు అందాలంటే స్థానికంగా మన వార్డుల్లో, కార్పొరేషన్‌లో పాలన సక్రమంగా ఉండాలి. అందుకే లోక్‌సత్తా 2009 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వార్డు మేనిఫెస్టోల్ని ప్రతి వార్డుకీ విడుదల చేసింది. ప్రతి వార్డులో సమస్యల్ని లోతుగా వివరిస్తూ, పరిష్కారాలను తెలియచేస్తూ, ప్రజల భాగస్వామ్యంతో నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కారాలు రూపొందించి ఆరోజున వార్డు మేనిఫెస్టోల్ని రూపొందించాం. ఆనాటి సమస్యలన్నీ దాదాపుగా ఇప్పటికీ అలాగే ఉన్నాయి. లోక్‌సత్తా ప్రతినిధులు కొంతమంది గెలిచివున్నా హైదరాబాద్ మునిసిపల్ సేవల పరిస్థితి ఇలా ఉండేది కాదని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఇది ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి సంబంధించిన ఎన్నిక కాదు. మన రోజువారీ సేవలకు సంబంధించిన స్థానిక ఎన్నికలు. వార్డు స్థాయిలో ప్రభుత్వాలు ఏర్పడకుండా అన్నీ ప్రధాని, ముఖ్యమంత్రి స్థాయిలో కేంద్రీకరించి పాలనను భ్రష్టుపట్టించాం. ప్రపంచంలోని ఏ చెప్పుకోదగిన దేశంలోనైనా స్థానిక ప్రభుత్వాలకు మొత్తం ఆదాయంలో 20–30శాతం ఖర్చు చేస్తుంటే, మనదేశంలో మాత్రం 7.3శాతమే ఖర్చు చేస్తూ జనం జీవితాల్ని దుర్భరం చేస్తున్నాం. ఆ డబ్బు కూడా ప్రజల పేరుతో ఖర్చవుతుంటుందికానీ, సమస్యలు పరిష్కారం కావు. ఎన్నికలొచ్చేసరికి ఏదోక గందరగోళం సృష్టించి డబ్బు వెదజల్లి గెలిచి మళ్లీ ఐదేళ్ల దాకా కబుర్లు తప్ప పాలన చేయరు. ఈ పరిస్థితిని మార్చేందుకే.. నేరుగా ఏటా రూ.2,000 ప్రతి పౌరుని పేరు మీదా కేటాయించాలని, దీనివల్ల వార్డు స్థాయిలో ప్రజలు ఎవరి కోసం ఎదురుచూడాల్సి పనిలేకుండా ఆ డబ్బుతో తమ పనులు తామే చేసుకోగలుగుతారని లోక్‌సత్తా 'వార్డు ప్రభుత్వాన్ని' ప్రతిపాదిస్తోంది. ఉదాహరణకి 10,000 జనాభా ఉన్న వార్డుకి ఏటా రూ.2కోట్లు నేరుగా వచ్చేస్తాయి. ప్రజల కమిటీలు ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకోవచ్చు. అక్కడ అవినీతి జరిగితే అంబుడ్స్‌మన్ ఉంటుంది. మన వార్డు, మన నగరం... ఆ తర్వాతే రాష్ట్రం, దేశం. ఈ వికేంద్రీకరణతోనే జనం సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది, ప్రజల భాగస్వామ్యం పెరిగి పౌరసత్వం, నాయకత్వం వికసిస్తాయి. మార్పుకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. రేపైనా తెచ్చుకోవచ్చు. కానీ ఆ ఆలస్యానికి మాత్రం చాలా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఒకోసారి కొన్ని తరాలు నష్టపోవచ్చు. అందుకే ప్రతిసారీ మళ్లీ వచ్చే ఎన్నికలలో చూసుకుందామని మంచి విధానాలను, మంచి రాజకీయాలను వాయిదా వేయవద్దు. అధికారాన్ని వికేంద్రీకరించి వార్డు స్థాయికి ప్రభుత్వాన్ని తీసుకొచ్చే విధానాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా సేవలందించే విధానాలకు, మీ సమస్యలకు తక్షణం స్పందించే ఏర్పాటు ఉన్న విధానాలకు, మెరుగైన అభ్యర్థులకు మాత్రమే ఎన్నికలలో ఓటు వేయండి.

2016 నూతన సంవత్సర శుభాకాంక్షలతో......






# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# బస్తీలు, కాలనీలకు నేరుగా నిధులు, సిటిజన్ ఛార్టర్లతోనే హైదరాబాదీలకు భద్రత, సంతోషం : జేపీ

లోక్‌సత్తా పార్టీ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రజల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

హైదరాబాద్ ఆవాజ్‌లో భాగంగా లోక్‌సత్తా పార్టీ నేతలతో కలిసి వివిధ ప్రాంతాల్లో జేపీ మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ప్రజాధనం దుర్వినియోగ మవుతోందని, ప్రజల అవసరాలు తీర్చటంలో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు, అధికారులు ఘోరంగా విఫలమవు తున్నారని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిధుల్ని ఖర్చు చేసేలా విధానాలు మారిస్తేనే అభివృద్ధి, అవినీతి లేని పాలన, పారిశుద్ధ్యం సాధ్యమవుతాయని అన్నారు.

జీహెచ్ఎంసీలో 2015-16 బడ్జెట్‌ను సుమారు రూ. 6400 కోట్లతో ప్రవేశపెట్టి అందులో ఏడు వందల కోట్లు ఉద్యోగుల జీతాలకే వినియోగిస్తున్నారని జేపీ అన్నారు. మిగిలిన బడ్జెట్‌ను జనాభా ప్రాతిపదికన చూస్తే, తలసరి రూ. 7000 ఖర్చు చేస్తున్నారన్నారు. అయితే అందులో వార్డు స్థాయి ప్రణాళిక, వికేంద్రీకరణ లేకపోవటం, అవినీతి, అసమర్థత, నిర్లక్ష్యం వల్ల ప్రజల మౌలిక సమస్యలు– నీటి వసతి, రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్, విద్య, ఆరోగ్యం విద్యుత్తు వంటివి ఏళ్లు గడుస్తున్నా అలాగే కొనసాగుతున్నాయన్నారు. ఎల్‌నినో వంటి వైపరీత్యాలతో చెన్నైలో వచ్చిన వరదలు ఇక్కడ కూడా వస్తే, ఫర్వాలేదు అనే ధీమా లేదన్నారు. అందుకే పైనుంచి అమలు పాలనకు ఇకనైనా స్వస్తిచెప్పి, నిధుల్ని నేరుగా ప్రతి బస్తీ, కాలనీకే ఏటా తలసరి రూ. 2000 కేటాయించి, సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు ఎన్నుకున్న కమిటీలను ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా డిమాండ్ చేస్తోందన్నారు. దీనివల్ల ప్రజల భద్రతకు కూడా భరోసా పెరుగుతుందన్నారు.

లోక్‌సత్తా ఎప్పటినుంచో పోరాడుతున్న సిటిజన్ ఛార్టర్లను చట్టబద్ధంగా ఏర్పాటు చేస్తే, ఉద్యోగులు సైతం బాధ్యతగా







పనిచేస్తారని జేపీ అన్నారు. ప్రజలకు అందించాల్సిన సేవలు ఆలస్యమైతే రోజుకు కొంత డబ్బును తప్పనిసరి పరిహారంగా చెల్లించే ఏర్పాటు చట్టబద్ధ సిటిజన్ ఛార్టర్లలో ఉంటుంది కాబట్టి, ప్రభుత్వ కార్యాలయాల్లో వేధింపులు, లంచాలు లేకుండా ప్రజలకు రోజువారీ పనులు జరుగుతాయన్నారు. అభివృద్ధి పనుల్లో కూడా జాప్యం చేస్తే అధికారుల జీతాల్లో జరిమానా రూపంలో కోత విధిస్తే పనులు వేగంగా జరుగుతాయన్నారు.

జీహెచ్ఎంసీలో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒకే కాల్‌సెంటర్‌ని ఏర్పాటు చేసి పరిష్కార వ్యవస్థలతో అనుసంధానం చేయాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ★

# మురికి మూసీ పాత రాజకీయమా?
# లోక్‌సత్తా 'వార్డు ప్రభుత్వ హైదరాబాద్' కొత్త రాజకీయమా?

కొత్త రాష్ట్రం పేరుతోనైనా అధికారాలు కిందిస్థాయికి వచ్చి హైదరాబాద్ కాలనీలు, బస్తీలు, రోడ్లు, తాగునీటి వ్యవస్థ, రవాణా, భద్రత, ప్రభుత్వ కార్యాలయాలు, పర్యావరణం బాగుపడి జీవితం కాస్త సురక్షితంగా, సంతోషంగా తయారవుతుందనుకుంటే, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మళ్లీ పాత రాజకీయం పాగా వేయాలని చూస్తోంది. అభివృద్ధినంతా హైదరాబాద్‌లో కేంద్రీకరించి మిగిలిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ని దగా చేసినా, ఎక్కువమంది యువతకు అత్తెసరు జీతాల ఉద్యోగాలు, నగరంలోని చాలా ప్రాంతాల్లో గుంతల రోడ్లు, మలమూత్రాలతో కలుషితమయ్యే మంచినీరు, కాలుష్యం, మురుగు, అభద్రత, నడ్డివిరిచే రవాణా వ్యవస్థలనే అందించిన పాత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల రాజకీయమే ఈసారి తెలంగాణ రాష్ట్ర సమితి రూపంలో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలవాలని అష్టదిగ్బంధ వ్యూహాలు పన్నుతోంది. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే తెరాసకు వేసినట్టే అనే పరిస్థితుల మధ్య మీడియాలో స్థలాల్ని కబ్జా చేసి మరీ రాష్ట్ర మంత్రులు ప్రచారంలో బరితెగిస్తున్నందున ముందుగా తెరాస గురించే మాట్లాడుకోవాలి.

మేం హైదరాబాద్‌లో 100 స్థానాలు లక్ష్యంగా పనిచేస్తాం, మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని తెరాస జీహెచ్‌ఎంసీ ఎన్నికల ఇంఛార్జిలలో ఒకరైన మంత్రి కె.తారక రామారావు రోజూ ఊదర గొడుతున్నారు. మళ్లీ ఎందుకైనా మంచిదని, మాకు మిగిలిన కార్పొరేషన్లలో హైదరాబాద్ ఒకటి మాత్రమే, హైదరాబాద్‌లో పెద్దగా గెలవకపోయినా మేం తెలంగాణలో అధికారంలోకి వచ్చాం కాబట్టి ఇక్కడి మునిసిపోల్స్ మాకు లెక్కేం కాదని అప్పుడప్పుడూ దబాయించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలిస్తే కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్న కేసీఆర్ ప్రయత్నం ఒకడుగు ముందుకు పడుతుందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. వాళ్ల వంశపారంపర్య రాజకీయాల గొడవ అలా ఉంచితే, ఎవరు గెలిస్తే హైదరాబాద్ ప్రజలకు ఏం ఒరుగుతుంది? ఏం చేస్తే హైదరాబాద్ అందరి సేఫ్ అండ్ హ్యాపీ నగరంగా వెలుగొందుతుంది? అన్నవే మనకు కావాల్సింది.




**కేటీఆర్ రోబో లీడర్ స్థాయి హామీలు**

హైదరాబాద్ కోసం ప్రత్యేక మేనిఫెస్టోని ప్రకటిస్తున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటివరకూ అందులో భాగంగా ఆయన చెబుతున్నవేమీ కొత్తవి లేవు.

❒ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద ఇల్లు లేని అందరికీ ఇళ్లు కట్టిచ్చి ఇస్తామంటున్నారు. అది ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేస్తున్న కార్యక్రమమే. అయితే నగరంలో ఇల్లు లేని వారికి ఏ కాలనీలో, ఎన్ని ఇళ్లు, ఎప్పటిలోగా ఇస్తారో మాత్రం తమవంతుగా మంత్రిగారు చెప్పలేక పోతున్నారు. ప్రతి దళిత కుటుంబానికీ 3 ఎకరాల భూమి, ప్రతి ఇంటికీ ఉద్యోగంలాగా హామీలు ఇచ్చేస్తున్నారు.

❒ రెండోది, విద్యుత్తు కష్టాలు తీరుస్తామని చెబుతున్నారు. మిగులు విద్యుత్తు అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో అది ఏ పార్టీ ఉన్నా చేయగలిగే రొటీన్ పనే. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలకు కూడా రొటీన్‌గా రోజంతా కరెంటు అందుతోంది. విద్యుదుత్పత్తి, పంపిణీలో నాణ్యత, నష్టాల తొలగింపు వంటివి చేపట్టి అంతిమంగా నిరంతర నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో కూడా విద్యుత్తు బిల్లుల చెల్లింపులను హేతుబద్ధంగా ఎంతమేరకు తగ్గించగలరో మంత్రి చెప్పలేదు.

❒ ఇక తెరాస ప్రకటించిన మిగిలిన హామీలన్నీ ప్రజల పన్నుల డబ్బుతో బకాయిల మాఫీలు, ఉచితాలు ప్రకటించటమే. అందుకు పెద్ద నాయకత్వం అక్కర్లా. రోబో లీడర్లు చాలు. ప్రజల డబ్బును సద్వినియోగం చేసేలా ప్రజలకు సాయం చేయటం నిజమైన మానవ నాయకత్వ లక్షణం. తెలంగాణలో తెరాస ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీల వల్ల చివరికి తక్కువ వడ్డీకి గౌరవప్రదంగా అప్పు దొరికే పరిస్థితి లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు విలవిలలాడి పోతున్నారు. రైతులు పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

రుణమాఫీలతో ఓట్లు దండుకోవటం తప్ప ఆ తర్వాత ఎవరు చచ్చినా పట్టదు కాబట్టే మళ్లీ అంత నిస్సిగ్గుగా, హేతుబద్ధ విధానాలు లేకుండా వరస బకాయిల మాఫీల్ని ప్రకటిస్తున్నారు. ప్రజలకు ఏం సేవలు సక్రమంగా అందుతున్నాయని మీరు ఆస్తిపన్ను మాఫీని గొప్ప పనిగా చెప్పుకుంటారు?

❑ ఆ తర్వాత హైదరాబాద్‌ని సమ్మిళిత అభివృద్ధితో విశ్వనగరంగా మారుస్తామని కేటీఆర్ చెబుతున్నారు. ప్రజల భాగస్వామ్యం, విశ్వనగరం ఈరెండూ ఉండాలంటే ఒక నగరానికి ఏమి చేయాలో మాత్రం సదరు మంత్రి చెప్పటం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ చైనా దేశానికి వెళ్లినప్పుడు అక్కడి నగరాల్లో మేయర్‌తో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆర్థిక విషయాలు చర్చించారు. మరి మన హైదరాబాద్‌లో మేయర్‌కి ఆ స్థాయిని కల్పించటం తెరాస వల్లవుతుందా? స్థానిక పాలన పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా, వార్డు స్థాయిలో పరిపాలనలో ప్రజలు భాగస్వాములయ్యేందుకు ఏర్పాట్లు లేకుండా హైదరాబాద్ విశ్వనగరం ఎలా అవుతుంది కేటీఆర్ గారూ? స్వచ్ఛ హైదరాబాద్ పేరుతో తెరాస ప్రభుత్వంలోని వారు ప్రజల డబ్బుని సొంత ప్రచారం కోసం ఎంత దుర్వినియోగం చేశారు! ముఖ్యమంత్రే మేయర్‌లాగా వ్యవహరించారు. ఇప్పుడు కేటీఆర్ కూడా ఇక్కడెవరూ నాయకుడే లేనట్టు హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలకు మేనిఫెస్టోని ప్రకటిస్తూ హామీల్ని గుప్పిస్తున్నారు. ఏ విశ్వనగరంలో రాష్ట్రాధినేతలు, మంత్రులు వచ్చి నగర పాలనలో కుర్చీ వేసుకుని పెత్తనం చెలాయించారు కేటీఆర్ సర్?

❑ మేయర్ దాకా కూడా అక్కర్లా. కనీసం స్థానికంగా ప్రజలు తాగునీరు, విద్యుత్తు కనెక్షన్లు, ధ్రువపత్రాలు, రోడ్లు




బాగు చేసుకోవటం, సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవటం, కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించుకోవటం వంటి పనులు చేసుకోవటానికి కాసిని నిధులు, అధికారాలు ఇవ్వటం తెరాస మేనిఫెస్టోలో ఉందా? లేదు.

ప్రజలు కోరుకున్న పాలన అందిస్తాం, మాకు ఓట్లు వేయకపోతే ఇంట్లో కూర్చుంటాం అని కేటీఆర్ ఒక టీవీ షోలో చెప్పారు. ప్రజలకు మేలు చేసే పాలనను మేలు చేసేరీతిలో అందించటానికి మానవ నాయకుడు సృజనాత్మక దార్శనికతతో పనిచేయాలి. ప్రజల్ని భావోద్రేకాలలో ముంచుతూ తాత్కాలికంగా ప్రజలు కోరుకున్నారు కాబట్టి ఆ మేరకే చేస్తామంటే, ఆ పని రోబోలు కూడా చేయగలవు. అలాగే రాజకీయమంటే ప్రజల్ని ప్రలోభపెట్టి, రెచ్చగొట్టి, ఇతర పార్టీల నాయకులను బెదిరించి, అవినీతి డబ్బులిచ్చి లోబరుచుకుని.. ఇలా ఎలాగోలా సాధించిన అధికారమే, ఆ అధికారం లేకపోతే ఇంట్లో కూర్చుంటాం అంటే అదీ రోబో స్థాయే. అందులో ప్రజల్ని ప్రేమించి, ప్రభావితం చేసి ఒప్పించి ముందుచూపుతో నడిపించే మానవ నాయకత్వం స్థాయి ఎక్కడుంది?

**రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నికలు కావివి, కేసీఆర్, కేటీఆర్ అండ్ కో ప్రచారం చేయటం అధికార దుర్వినియోగమే**

ఈ ఎన్నికలకు తెరాస ప్రభుత్వానికి ఏం సంబంధం లేదు. ముఖ్యమంత్రి పదవి వేరు, మునిసిపల్ ఎన్నికలు వేరు. కాబట్టి ఏరకంగానూ రాష్ట్రప్రభుత్వానికి ఈ ఎన్నికలతో సంబంధం లేదు. వార్డు స్థాయిలో తమ రోజువారీ సేవలకు సరైన ఎజెండాగల సరైన అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాల్సిన ఎన్నికలివి. మంత్రులచ్చి ఇక్కడ ప్రచారం చేసి పెత్తనం చేస్తుంటారు. ఇప్పుడే ఇలా ఉంటే, రేపు ఒకవేళ అధికారంలోకి వస్తే ఇక ఆగుతారా? పదవుల్లో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు తదితరులు ఎన్నికల ప్రచారానికి వెళ్లటం పదవుల్ని దుర్వినియోగం చేయటమే. వాళ్ల ప్రచారవటాటోవం ముందు ఏ అధికారంలేని అభ్యర్థులు ఎలా నిలవగలుగుతారు? వాళ్లు ఏం మాట్లాడినా ప్రజలు అవి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వాగ్దానాలుగానే భావిస్తారు. మునిసిపల్ ఎన్నికలలో రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్నవారు ప్రచారం చేయటం ఆ పదవీ దుర్వినియోగానికి పరాకాష్ఠ. వారికి అంతగా ప్రచారం చేయాలని ఉంటే, తమ పదవులకి రాజీనామా చేసి వచ్చి జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారం చేయాలి.

**పాత తెదేపా, కాంగ్రెస్ జంప్ జిలానీలే ఇప్పుడు తెరాస నేతలు, ఇక ఏం మార్పు తెస్తారు?**

గత ఐదేళ్లుగా ఇక్కడ అవినీతికి పాల్పడి, జల్సాలతో ప్రజల డబ్బుని దుర్వినియోగం చేసి, ఉన్న నిధుల్ని కూడా అభివృద్ధికి వినియోగించని తెదేపా, కాంగ్రెస్ నేతలనే, కార్పొరేటర్లనే తెరాస

**గత ఐదేళ్లుగా ఇక్కడ అవినీతికి పాల్పడి, జల్సాలతో ప్రజల డబ్బుని దుర్వినియోగం చేసి, ఉన్న నిధుల్ని కూడా అభివృద్ధికి వినియోగించని తెదేపా, కాంగ్రెస్ నేతలనే, కార్పొరేటర్లనే తెరాస ఇప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వినియోగించుకుంటోంది. ప్రజల తీర్పుని అపహాస్యం చేసిన ఈ జంప్‌జిలానీలతో తెరాస చేసే కొత్త రాజకీయం ఏమిటి? తెరాస కండువా మాటున ఉంటే అవినీతి దాగుతుందా?**

ఇప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వినియోగించుకుంటోంది. ప్రజల తీర్పుని అపహాస్యం చేసిన ఈ జంప్‌జిలానీలతో తెరాస చేసే కొత్త రాజకీయం ఏమిటి? తెరాస కండువా మాటున ఉంటే అవినీతి దాగుతుందా? జీహెచ్ఎంసీ వాహనాల కొనుగోలు, మరమ్మతులలో రూ.100కోట్ల స్కాం, ప్లేటు భోజనం రూ.2000తో చేసిన జల్సాలు, ల్యాప్‌టాప్‌లు, హ్యాండీ కెమెరాలు కొనిచ్చినా కొరియర్‌లకు భారీగా ప్రజాధనం చెల్లింపులు, వార్డుల అభివృద్ధికిచ్చిన నిధుల్లో రూ.490 కోట్లు మురిగిపోయేలా చేయటం, గర్భనిరోధక వ్యాక్సిన్ పేరుతో వీధికుక్కకు రూ.5,000 ఖర్చుచేసినా ఫలితాలు లేకపోవటం ఇలా గత ఐదారేళ్ల నిర్వాకాన్నీ లోక్‌సత్తా సమాచార హక్కు చట్టం ద్వారా బైటపెట్టింది. మళ్లీ ఆ పార్టీల నేతలతోనే, పాత కేంద్రీకృత ఎజెండాతోనే తెరాస జీహెచ్ఎంసీ ఎన్నికలలోకి వస్తోంది. ఇంకేం మార్పు తేగలుగుతుంది?

**2009లో లోక్‌సత్తా వార్డు మేని ఫెస్టోల్లో సమస్యలు ఇప్పటికీ యధాతథం**

2009 ఎన్నికలలో లోక్‌సత్తా ప్రతి వార్డులోని సమస్యలూ, పరిష్కారాలతో వార్డు మేనిఫెస్టోల్ని విడుదల చేసింది. ఆ సమస్యలు అన్నీ దాదాపు ఇప్పటికీ యధాతథంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ వల్ల వచ్చిన ఆదాయం మిగులుతో పందేరాలు చేస్తూ సొంత ప్రచారం చేసుకుంటున్న తెరాస ప్రభుత్వం నగరంలో పారిశుద్ధ్యాన్ని బాగు చేసేందుకు ఇంతవరకూ చర్యలు కూడా చేపట్టలేకపోయింది. స్వచ్ఛభారత్ వంటి అవకాశాల్ని తెరాస నేతలు దుర్వినియోగం చేసిన తీరుని, సొంత ప్రచారానికి వాడుకున్న వైనాన్ని చూస్తుంటే, వారికి కార్పొరేషన్ అధికారం వస్తే ఏం చేస్తారో తేటతెల్లమవుతుంది. స్థానికంగా పారిశుధ్యవ్యవస్థని బాగుచేయకుండా, ముఖ్యమంత్రి కేసీఆర్ పార్సిగుట్ట ప్రాంతానికి తనను తాను ఇంఛార్జిగా ప్రకటించుకున్నారు. మళ్లీ ఆవైపు చూస్తే ఒట్టు. యజ్ఞాలుయాగాలకు సమయం దొరుకుతుంది తప్ప అక్కడి సమస్యల్ని పట్టించుకునే తీరిక సీఎంగారికి లేదు. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా తన ఫాంహౌస్‌లో చేసుకున్న యజ్ఞానికి సీఎం హోదాని కేసీఆర్ దుర్వినియోగం చేశారు. ఏ హోదాలో ఆయన రాష్ట్రపతి నుంచి పలువురు ప్రముఖుల్ని ఆహ్వానించారు? ఎందుకు ఆ వార్తలకు మీడియాలో ప్రముఖంగా కవరేజీ వచ్చింది? వ్యక్తిగతమే అయినా, ఓటుకు కోట్లు కేసులో ప్రధాన నిందితుల్ని కూడా స్వయంగా వెళ్లి ఎలా ఆహ్వానించారు? యాగానికిచ్చిన సమయంలో కొంచెమైనా పుస్తక ప్రదర్శన ప్రచారానికి దొరకలేదా? వ్యక్తిగతానికి, పార్టీకి, ప్రజాప్రాతినిధ్యానికి గీతల్ని తరచూ చెరిపేసే ఇలాంటి ముఖ్యమంత్రి తమ కాలనీ ఇంఛార్జిగా స్వయంగా ప్రకటించుకున్నారు కాబట్టి ఏమన్నా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్దామంటే ఎవరిని అడగాలో, ఎలా అడగాలో ప్రజలకి తెలియదు. అవినీతి జరిగితే కాల్ చేయండి, నే చూసుకుంటా అని ముఖ్యమంత్రి ఒక నంబర్ ఇచ్చారు, భారీసంఖ్యలో ఆరోపణలు వచ్చాయని ఓసారి చెప్పారు, తర్వాత ఎన్ని ఆరోపణలు వచ్చాయో, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పే జవాబుదారీ వ్యవస్థ లేదు. ముఖ్యమంత్రి చెప్పిన కేసుల్లో, చెబుతున్నప్పుడు ఏసీబీ పనిచేస్తుంటుంది. లేకపోతే ఏ కేసూ తెమలదు.

**కోట్లు ఖర్చవుతోంది నేతలకు ప్రచారం, ఓట్లు తెచ్చే అసంబద్ధ పథకాలకే, రాష్ట్రబడ్జెట్‌లోనైనా తలసరి రూ.1000-2,000 కేటాయించ మంటే మనసొప్పలేదు**

గత 18నెలల తెరాస చరిత్రను, అంతకుముందు వివిధ పార్టీల చరిత్రను చూశాక హైదరాబాద్‌లో అత్యధిక శాతం ప్రజల జీవితాలు బాగుపడాలంటే, రోజువారీ పనులు వార్డు స్థాయిలో జరిగే ఏర్పాటు ఉంటే తప్ప సాధ్యం కాదు అనేది సుస్పష్టం. హైదరాబాద్‌లో ఒక్కొక్క పౌరుని పేరు మీద ఏటా రూ.5,000–7,000 ఖర్చు చేస్తున్నా, స్థానికంగా ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నిధుల్లో 70శాతానికిపైగా పైనుంచి ఖర్చు చేస్తుండటమే ఇందుకు కారణం. వార్డు స్థాయిలో వినియోగించాల్సిన నిధుల్ని కూడా ఖర్చుచేయకుండా జల్సాలు చేసుకుంటారు, ఇష్టమొచ్చిన వాటికి మళ్లిస్తుంటారు. నేతలకు వ్యక్తిగతంగా పేరు తెచ్చిపెట్టే పథకాలకు నిధుల్ని మళ్లిస్తుంటారు. దీనివల్ల డబ్బు వేలకోట్లలో ఖర్చవుతుంటుంది తప్ప ప్రజల సమస్యలు మాత్రం యధాతథంగా కొనసాగుతుంటాయి. పథకాలకు తప్పనిసరిగా ఖర్చు చేసే నిధులలో కూడా అవినీతి, అసంబద్ధత. డ్రైనేజీ పనులు పూర్తిచేయకుండానే రోడ్లు వేయటం వల్ల అవి వేసిన కొన్ని రోజులలోనే కొట్టుకుపోవటం జరుగుతోంది. ఇప్పుడు ఎన్నికలస్తున్నాయిగదా, ప్రతి ఏరియాలోనూ రోడ్లు వేసే పనులు పొద్దున్నేనే

మొదలవుతున్నాయి. ఎన్నికలు పూర్తయ్యాక మళ్లీ ఆరోడ్లు ఉండవు. ఇదే తంతు ఏళ్ల తరబడి. దాన్నే మళ్లీ తెరాస కొత్త రంగుతో కొనసాగించే ప్రయత్నం చేస్తోంది.

తెరాస ప్రభుత్వం రూ. 1లక్ష కోట్ల పైచిలుకు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడు కూడా లోక్‌సత్తా డిమాండ్ చేసింది– నేరుగా రాష్ట్ర బడ్జెట్ నుంచి తలసరి రూ. 2,000 కేటాయిస్తే హైదరాబాద్‌కు కేవలం రూ. 2,000 కోట్లు ఖర్చవుతుంది, బడ్జెట్‌లో అది కేవలం 2శాతం లోపు, కేటా యించండయ్యా అని. ఆ పని చేసి ఉంటే ఈ పద్దెనిమిది నెలల్లోనే చాలా మార్పు హైదరాబాద్‌లో కనిపించి ఉండేది. అది చెయ్యకుండా కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపు కోసం ఎమ్మెల్యేల కొనుగోలు, రకరకాల కుంటిసాకులతో ఎన్నికల వాయిదాలు చేస్తూ వచ్చింది. మిగిలిన తెలంగాణ మొత్తం కూడా ఇలా తలసరి కనీసం రూ. 1000 కేటాయిస్తే రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 4శాతం ఖర్చవుతుంది, కానీ జనం జీవితాల్లో గొప్ప మార్పు ప్రారంభమవుతుంది. పోరాటాలు చేసి కొత్త రాష్ట్రాన్ని తెచ్చుకున్నందుకు అట్టడుగుస్థాయి ప్రజలు క్రియాశీలంగా రాజకీయాల్లో, పాలనలో భాగస్వాము లవుతుండేవారు. హైదరాబాద్‌లో మిగులు ఆదాయాన్ని ఇష్టమొచ్చినట్టు ఖర్చు చేయటం, రోజుకో ఆర్భాటపు ప్రకటన చేయటం తప్ప అవేమీ కేసీఆర్ ప్రభుత్వం చేయలేదు.

**కాంగ్రెస్, తెదేపాకు ఓటు వేస్తు**

ఇన్ని అనర్థాలకు కారణమైన కాంగ్రెస్ పార్టీ ఇంకా విధానపరమైన మార్పులతో కాకుండా పాత రాజకీయం, పాత వంశపారంపర్య, దోపిడీ నాయకత్వంతోనే, కేవలం తెరాసను ఓడించటమే లక్ష్యంగా వస్తోంది. ఎలాగోలా ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కాగలిగాను అని సంతృప్తిపడుతున్న తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇప్పుడు తెలంగాణలో తన పార్టీ అవసరం లేకుండా చేసుకున్నారు. తెలుగుదేశం ఎందుకు అనే ప్రశ్న, తెలుగుదేశంకు ఓటు వేస్తే తెరాసకు వేసినట్టే అనే భావన ఇప్పుడు ఆ పార్టీ ఉనికికి సవాలుగా మారాయి. లోక్‌సత్తాను హైదరాబాద్‌లో ఓడించటానికి అబద్ధాలతో, విద్వేషాలతో చేయాల్సిందంతా చంద్రబాబు చేశారు. ఏం చేసినా లోక్‌సత్తా తన విధానాలకు, నూతన రాజకీయ సంస్కృతికి కట్టుబడి వ్యవహరించింది. ఓట్ల పరంగా ఓడినా, విలువల పరంగా గెలిచింది. ఇక్కడుంటే సెటిలర్లకు కొన్ని సీట్లిస్తామని తెరాస వంటి పార్టీలు రాజ్యాంగవిరుద్ధమైన భాషలో చెబుతున్నాయి, అందుకు విరుద్ధంగా భారతదేశంలో తాను ఎక్కడుంటే అక్కడే పోటీచేస్తానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్‌లోనే పోటీ చేశారు. అవసరమైతే భారతదేశ పౌరునిగా ఆంధ్రప్రదేశ్ సహా ఎక్కడ అవకాశం లభిస్తే అక్కడ పోటీచేస్తానని చెప్పారు. ఆ జాతీయతా భావంతోనే ఎవరికైనా ఎక్కడైనా లోక్‌సత్తా టికెట్లు ఇస్తుంది. రాజ్యాంగ ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం స్థానికంగా ఉంటున్నవారికే సాధారణంగా ఎక్కువ సీట్లు దక్కుతాయి. 2009 ఎన్నికలలో లోక్‌సత్తా పనిగట్టుకుని కుహనా కులవాదంతో టికెట్లివ్వకపోయినా, ప్రజాస్వామ్య యుతంగానే ప్రతి ముగ్గురు అభ్యర్థులలో ఒక బీసీకి టికెట్ లభించింది. పార్టీలు ప్రజల ఆస్తిగా ఉంటే సంకుచిత రాజకీయాలకు ఆస్కార ముండదు.

**భారతదేశంలో తాను ఎక్కడుంటే అక్కడే పోటీచేస్తానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్‌లోనే పోటీ చేశారు. అవసరమైతే భారతదేశ పౌరునిగా ఆంధ్రప్రదేశ్ సహా ఎక్కడ అవకాశం లభిస్తే అక్కడ పోటీచేస్తానని చెప్పారు. ఆ జాతీయతా భావంతోనే ఎవరికైనా ఎక్కడైనా లోక్‌సత్తా టికెట్లు ఇస్తుంది.**

**లోక్‌సత్తా 'సేఫ్ అండ్ హ్యాపీ హైదరాబాద్' మూడు సూత్రాల ఎజెండా**

అలాగే మురికిమూసీని తలపిస్తున్న కేంద్రీకృత పాత రాజకీయం స్థానంలో సేఫ్ అండ్ హ్యాపీ హైదరాబాద్‌కు గ్యారంటీనిచ్చే వికేంద్రీకరణ ఎజెండా లోక్‌సత్తాది. అందరికీ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలతోపాటు మూడు కీలక అంశాలు లోక్‌సత్తా ఎజెండాలోఉంటాయి

1) తలసరి రూ. 2,000 చొప్పున ఏటా వార్డులలో ప్రజల కమిటీలకు నేరుగా కేటాయింపు. దీనివల్ల రోజువారీ రోడ్లు, మంచినీరు, వీధిదీపాలు, పాఠశాలలు, ఆసుపత్రులు సమస్యలు వంటివాటిని ప్రజలు వెంటనే పరిష్కరించు కోగలుగుతారు. ఇక్కడ అవినీతి జరిగితే చర్యలకు అంబుడ్స్‌మన్ ఏర్పాటు చేయాలి.

2) ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాల బెడద, వేధింపులు లేకుండా విద్య, ఆరోగ్యం సహా అన్ని సేవలకూ సిటిజన్ ఛార్టర్లు అమలు చేసి నిర్ణీత వ్యవధిలోపు పనులు పూర్తికాకపోతే రోజుకు రూ. 250 పరిహారం చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టం అమలు.

3) అందరి, అన్ని సమస్యలకూ ఒకే కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, ప్రతి సమస్యా పరిష్కరించేంతవరకూ పర్యవేక్షించే ఏర్పాటు.

ఈ వార్డు స్థాయి పాలనే ఇప్పుడు హైదరాబాద్‌కి కావలసింది. లోక్‌సత్తా ఏ పార్టీతోనైనా విధానపరమైన ఘర్షణే తప్ప ద్వేషం ఉండదు. అందువల్ల ఎజెండా ప్రాతిపదికన ఏ శక్తులతోనైనా కలిసిపని చేయటానికి సిద్ధంగా ఉంటుంది. ★

# అలాంటి నేతలను ఎన్నుకుంటే మన డబ్బు మూసీలో పోసినట్టే : లోక్‌సత్తా వినూత్న ఆందోళన

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు గత ఆరేళ్లుగా రూ. 3630 కోట్ల నష్టం వాటిల్లిందని, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని లోక్‌సత్తా పార్టీ నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంపై నేతల తీరుకి అద్దం పట్టేలా, జీరో రూపీ వెయ్యిరూపాయల నోట్లను అంబర్‌పేట వద్ద మూసీ నదిలోకి వదిలి, జీహెచ్ఎంసీ డబ్బులు కొట్టుకుపోయాయంటూ నినాదాలు చేశారు.**



కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారుల పోటాపోటీ కమీషన్లు, స్కాములు, నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం, ప్రచార ప్రకటనలు, విలాసాల వల్ల గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు గత ఆరేళ్లుగా రూ. 3630 కోట్ల నష్టం వాటిల్లిందని, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని లోక్‌సత్తా పార్టీ నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంపై నేతల తీరుకి అద్దం పట్టేలా, జీరో రూపీ వెయ్యిరూపాయల నోట్లను అంబర్‌పేట వద్ద మూసీ నదిలోకి వదిలి, జీహెచ్ఎంసీ డబ్బులు కొట్టుకుపోయాయంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోసపాటి రాము, బొంతు సాంబిరెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో బడ్జెట్ ఎంతో, దేనికి ఎంతెంత ఖర్చు చేశారో శ్వేతపత్రం ప్రకటిస్తే ఇన్నేళ్లుగా నగరాన్ని ఏలిన నేతల బండారం బైటపడుతుందన్నారు. బల్దియా డబ్బుల్ని మళ్లించిన నేతలే నిస్సిగ్గుగా మళ్లీ ఎన్నికలలోకి వస్తున్నారన్నారు. పారిశుద్ధ్య, వాహనాల కుంభకోణంలో రూ. 100కోట్లు, రోడ్ల స్కాంలో రూ. 150 కోట్లు (2012-14) ఇలా పలు అంశాలలో పారదర్శకత లేదని, వార్డుల అభివృద్ధికి కార్పొరేటర్లకు వచ్చిన నిధుల్లో రూ. 450 కోట్లు ఖర్చే చేయలేదని, ప్లేటు భోజనానికి రూ. 2000 ఖర్చు చేయటం, అధ్యయన టూర్లు, ల్యాప్‌ట్యాప్‌ల కొనుగోలు వంటి విలాసాలకు ప్రజాధనాన్ని లెక్కాపత్రం లేకుండా వెదజల్లారని, వీరి నిధుల దుర్వినియోగం లెక్క తీస్తే రోజుకు రూ. 2కోట్ల మేర ఉందని తెలిపారు. వీటన్నిటి మీదా పాలకమండలిలో ఎవరూ ప్రశ్నించలేదని, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కయి హైదరాబాద్‌ని దోచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ భౌగోళికంగా అన్ని వనరులూ ఉన్న నగరమని, కానీ మనం ఎన్నుకున్న నేతల నిర్వాకం వల్ల అధ్వాన్నంగా తయారవుతోందని, నానాటికీ కాలుష్యం పెరుగుతోందని అన్నారు. చెన్నైలో వర్షాలలాంటి వాతావరణ ముప్పు హైదరాబాద్‌కి వస్తే, సన్నద్ధత లేదన్నారు. ఇలాంటి అవినీతి పాలనలో భాగస్వాములైన నేతలకే ఇప్పుడు టీఆర్ఎస్ కండువా కప్పి టికెట్లు ఇస్తున్నారన్నారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం, రే, వాంబే పథకాల కింద 36,000 ఇళ్ల గురించి మాట్లాడకుండా జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం డబుల్ బెడ్‌రూం పథకాన్ని అరచేతిలో స్వర్గంలా చూపుతున్నారన్నారు.

అవినీతిలో, ప్రజాధనం వృధాలో ఆరితేరిన ఇలాంటి నేతల ఆట కట్టించటానికి అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేసి శిక్షించే ఏర్పాటు చేయాలని, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్తని కూడా బలోపేతం చేయాలని, అన్నిటికంటే ముఖ్యంగా ప్రజలు అప్రమత్తమవ్వాలని రాము, సాంబిరెడ్డి అన్నారు. లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మెట్ల జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, గంగాభవానీ, ప్రసాద్, సతీష్, రాఘవయ్య, గంగాధర్, సంతోష్, మునుపల్లి వెంకటేష్ తదితర నేతలు పాల్గొన్నారు. ★

# జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల నిర్వాకంతో మురిగిపోయిన రూ.450 కోట్లు: లోక్‌సత్తా

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రూ. 1కోటి జనం సొమ్ము పెట్టి ల్యాప్‌టాప్, ప్రింటర్, ఫోటోలతో సహా సమస్యలను వివరించేందుకు రూ. 31 లక్షలతో హ్యాండీ కామ్ కొనిచ్చినా, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్లు వారికిచ్చిన నిధుల్ని ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ఖర్చు చేయటంలో ఘోరంగా విఫలమయ్యారని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవీ ప్రసాద్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి ఆరోపించారు. కౌన్సిల్ సమావేశాల్లో తాగునీరు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, ట్రాఫిక్, చట్టాలు, విధానాలు వంటి వాటి గురించి కార్పొరేటర్లు ప్రస్తావించిన దాఖలాలే లేవని, అక్రమ కట్టడాల నుంచి, బిల్లు కలెక్టర్లు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు గుంజటానికే తమ పదవీకాలాన్ని ఉపయోగించి ప్రజావ్యతిరేకులుగా మాజీలయ్యారన్నారు.

డివిజన్ అభివృద్ధికి ఒక్కొక్క కార్పొరేటర్‌కి రూ.4 కోట్ల 60లక్షల చొప్పున హైదరాబాద్‌లోని 150 మంది కార్పొరేటర్లకు రూ.690 కోట్లు ఉంటే, ఐదేళ్లలో మన సోకాల్డ్ నాయకులు యాభై శాతం కంటే తక్కువగా కేవలం రూ.239.77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని దేవీప్రసాద్, సాంబిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ తరపున మేయర్‌గా పనిచేసిన బండ కార్తిక రెడ్డి 1.18 కోట్లు, ఎంఐఎం తరపున మేయర్‌గా చేసిన మాజిద్ హుస్సేన్ రూ. 2.17 కోట్లు మాత్రమే ఖర్చు చేయటం ప్రజల సమస్యల పట్ల వారికెంత శ్రద్ధ ఉందో తెలియచేస్తోందన్నారు. డిప్యూటీ మేయర్లు రాజ్‌కుమార్ రూ.1.9 కోట్లు, జాఫర్ హుస్సేన్ రూ.1.6825 కోట్లు ఖర్చు చేసి తమ పదవీ బాధ్యతల్లో విఫలమయ్యారన్నారు. అదేవిధంగా ఫ్లోర్ లీడర్లు సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.1.5 కోట్లు, బంగారి ప్రకాష్ రూ.1.9 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ధూల్‌పేట కార్పొరేటర్ అనిల్ సింగ్ (కాంగ్రెస్) అత్యల్పంగా 0.33 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, రాజేంద్రనగర్ కార్పొరేటర్ జె.సత్యనారాయణ (కాంగ్రెస్) అత్యధికంగా 4.66 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

**మొదటి సంవత్సరం రూ.60 లక్షలు, ఆ తర్వాతి సంవత్సరం నుంచి ఏటా రూ.1 కోటి చొప్పున ఐదేళ్లలో రూ.4 కోట్ల 60 లక్షలు ఒక్కొక్క కార్పొరేటర్‌కి డివిజన్ అభివృద్ధికి రూ.4 కోట్ల 60లక్షల నిధులు ఉంటే, వారు చేసిన ఖర్చును పార్టీలవారీగా అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో దేవీప్రసాద్, సాంబిరెడ్డి మీడియాకు విడుదల చేశారు...**

**బీజేపీ :**

(కేటాయించిన మొత్తం రూ. 4 కోట్ల 60లక్షలకుగాను కార్పొరేటర్లు చేసిన ఖర్చు - కోట్లలో)

కె. సహదేవ్ (కూర్మగూడ)-1.31 కోట్లు, ఎం. వైకుంఠం (గోషామహల్)-0.74 కోట్లు, బంగారి ప్రకాష్ (మెహిదీపట్నం)-1.9 కోట్లు, డి.దీప (గుడిమల్కాపూర్)-1.5 కోట్లు, కె. ఉమారాణి (కాచిగూడ)-రూ.1 కోటి మాత్రమే ఖర్చు చేశారు.

**తెలుగుదేశం :**

కొత్త రామారావు (కాప్రా)-2.38 కోట్లు, జి. శ్రీనివాస్ రెడ్డి (మల్లాపూర్)-1.16, వి. ప్రకాష్ గౌడ్ (కొత్తపేట)-రూ.1.31, కొప్పుల లత (మన్సూరాబాద్)- 1.52, సామా ప్రభాకర్ రెడ్డి (హయత్ నగర్)-1.82, జిట్ట రాజశేఖర్ రెడ్డి (వనస్థలిపురం)-1.83, గజ్జల సుష్మ (కర్మన్‌ఘాట్)-1.36, ఎస్. రమణా రెడ్డి (చంపాపేట్)-0.83, యల్లటి భార్గవి (సరూర్‌నగర్)-0.86, దీపా సురేఖ (రామకృష్ణపురం)- 1.45, ధనలక్ష్మి (పి అండ్ టి కాలనీ)- 1.20, మహమ్మద్ అస్లం పాషా (మూసారంబాగ్)-1.49, శ్రీనివాసరెడ్డి (సైదాబాద్)- 1.52, మంచిరెడ్డి (ఐఎస్ సదన్)- 1.26, సి. శ్రీనివాస్ (సలీం నగర్)-1.31, రాజేందర్ (అలియాబాద్)- 1.38, టి. ప్రేం దాస్ గౌడ్ (మైలార్‌దేవరపల్లి)-4.03, టి. రాజాసింగ్ (మంగల్‌హాట్)-1.66, జె. హేమలత (హిమాయత్‌నగర్)-1.4, అడపా చంద్రమౌళి (విద్యానగర్)-1.34, నరితా గోవింద్ (ముషీరాబాద్)-1.8, ముఠా పద్మ (గాంధీనగర్)-1.55, ఎం. వెంకటరమణ (అమీర్‌పేట)-1.09, శేషుకుమారి (బల్కంపేట)-1.29, కె. సదాశివయాదవ్ (ఎర్రగడ్డ)-1.67, అట్లూరి విజయలక్ష్మి (శ్రీనగర్ కాలనీ)-1.35, జి. రాజమౌళి (యూసఫ్‌గూడ-టీఆర్ఎస్‌లోకి జంప్ చేశారు)-1.95, నీలం రవీందర్ (శేరిలింగంపల్లి)-1.41, వి. అశోక్‌గౌడ్ (చందానగర్)-2.88, ఎం. స్వప్నదేవ్ (పటాన్‌చెరువు)-1.77, దండమూడి సామ్రాజ్యం (కె.పి.హెచ్.బి)-1.22, బాబూరావు (మూసాపేట్)- 2.38, సయ్యద్ హుస్సేన్(మోతీనగర్)- 2.77, ఎం. కృష్ణగౌడ్ (ఫతేనగర్)-1.25, మాధవరం రామారావు (వివేకానందనగర్)- 2.58, మాధవరం భానుప్రసాద్- 1.46, బి. విజయశేఖర్ (చింతల్) -1.58, బట్టా కృష్ణ (షాపూర్‌నగర్)-1.7, కూన మాణిక్యం (జీడిమెట్ల)- 1.6, బద్దు వెంకటేశ్వరరావు (కుత్బుల్లాపూర్)- 1.97, ఇ.ఎస్ రాజ్ జితేందర్ నాథ్ (మచ్చబల్లారం)- 1.56, మంజుల (సఫిల్‌గూడ)- 1.13, సుమలత (గౌతం నగర్)- 1.39, ప్రేం కుమార్ (ఓల్డ్ మల్కాజిగిరి)- 1.30, ఎ. సావిత్రి (పద్మారావు నగర్)- 1.15 కోట్లు.

**కాంగ్రెస్ :**

నెమలి సురేష్ (నాచారం)-0.98కోట్లు, కోగుల సుగుణ (ఉప్పల్)-1.97, హరివర్ధన్ (హబ్సీగూడ)-1.91, పరమేశ్వర్ (రామంతపూర్)-1.98, ఎ.జితేంద్ర (గౌలిపుర)-1.21,రంజనాదేవి గోయల్ (ఘాన్సీబజార్)-1.32, జి.శంకర్ యాదవ్ (బేగంబజార్)-1.36, అనిల్ సింగ్ (ధూల్‌పేట్)-0.33, సత్యనారాయణ జె.(రాజేంద్రనగర్)-4.66, ఎ.కృష్ణ (జియాగూడ)-1.36, మధు (గన్‌ఫౌండ్రీ)-1.18, ఎం.పి శ్రీరాం చందర్ (సుల్తాన్ బజార్)-1.25, కాలేరు వెంకటేశం (గోల్నాక)-1.46, జ్ఞానేశ్వర్ గౌడ్ (బాగ్ అంబర్‌పేట)- 1.8, జి. శ్రీదేవి (నల్లకుంట)-1.92, ఎం.ప్రభాకర్ రెడ్డి (బాగ్‌లింగంపల్లి)-1.39, సి.సునీత(అడిక్‌మెట్)-2.08, రావుల శేషగిరి(గాజుల రామారం)-2.15, జగన్ (జగద్గిరిగుట్ట)-2.26, జి. సత్యనారాయణ రెడ్డి (సూరారం కాలనీ)-1.7, ఎ.ఆర్ ప్రసన్న కుమారి (యాప్రాల్)-1.48, గీతారాణి (అల్వాల్)-1.81, మరియమ్మ (డిఫెన్స్ కాలనీ)-1.07, భారతీరాజ్ (మౌలాలి)-1.39, బండా కార్తీక రెడ్డి (తార్నాక)-1.18, ఎం.ఆర్ శ్రీనివాసరావు(మెట్టుగూడ)-0.95, ఎ. విజయకుమార్ (సీతాఫల్‌మండి)-0.73, ఎ. ఉమాదేవి (బౌద్ధనగర్)-0.71, పి.మీరా(చిలకలగూడ)-1.57, జె.దయానంద్ (బన్సీలాల్‌పేట)-1.23, కె. కిరణ్మయి (రాంగోపాల్‌పేట)-1.01, టి.మహేశ్వరి (బేగంపేట)-1.17, కె.సరితా యాదవ్ (మారేడ్‌పల్లి)-1.78, రత్నకుమారి (అడ్డగుట్ట)-0.97, కల్పనా యాదవ్ (రాంనగర్)-2.98, రాజ్‌కుమార్ (కవాడిగూడ)-1.9, పి.నిర్మల(దోమలగూడ)-1.34, షేక్ షరీఫ్ (ఖైరతాబాద్)-1.53, బి.రాజుయాదవ్ (పంజాగుట్ట)-1.75, మహేష్ యాదవ్ (సోమాజీగూడ)-1.44, ఆయుబ్‌ఖాన్ (సనత్‌నగర్)-1.53, శ్యాంరావు (వెంగళరావునగర్)-1.27, బి.భారతి (బంజారాహిల్స్)-1.27, బి. చంద్రమ్మ (రహ్మత్‌నగర్)-2.06, వనజజ్యోతి (బోరబండ)-1.90, లక్ష్మీబాయి (జూబ్లీ హిల్స్)-1.38, సుధాకర్ (షేక్‌పేట)-1.84, ఆవుల సత్యనారాయణ (గచ్చిబౌలి)-1.4, బి. పుష్ప (రామచంద్రాపురం)-1.61, గొట్టిముక్కల వెంగళరావు (కూకట్‌పల్లి)-2 కోట్లు, జగదీశ్వర్ (హఫీజ్‌పేట)-1.61, నర్సింహాయాదవ్ (ఓల్డ్ బోయినపల్లి-ప్రజారాజ్యం పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారు)-2 కోట్లు.

**ఎంఐఎం :**

మీర్ వాజిద్ అలీఖాన్ (సంతోష్‌నగర్)-1.97 కోట్లు, బేగ్ (రియాసత్‌నగర్)-1.81, మహ్మద్ ముంతాజ్‌అలీ (కంచన్‌బాగ్)-2.25, మహ్మద్ అవాల్గీ (బార్కస్)-1.35, అబ్దుల్ ఖావీ అన్సారీ (చాంద్రాయణగుట్ట)-1.41, భాయ్ (జంగామెట్ట)-1.19, అబ్దుల్ (ఉప్పుగూడ)-2.44, డా॥ నక్షబందీ (లలితాబాగ్)-1.47, ఖాజా బిలాల అహ్మద్ (రెయిన్‌బజార్)-0.99, మహ్మద్ ముర్తజా అలీ (ఛావ్నీ)-1.01, సయ్యద్ మిన్హాజుద్దీన్ (అక్బర్‌బాగ్)-1.17, నజీర్ (ఓల్డ్ మలక్‌పేట)-1.00, మహ్మద్ (డబీర్‌పుర)-1.42, హసన్ ఎఫెందీ (నూర్ఖాన్ బజార్)-1.48, అబ్దుల్లా బలాలా (పత్తర్ ఘట్టి)-1.6, ఖాన్ (తలాబ్‌చంచాలం)-1.63, మహ్మద్ ముక్రం అలీ (మొగల్‌పుర)-1.35, బేగం (ఫలక్‌నుమా)-1.5, ఖుమర్ బేగం (కుంట)-1.53, అమీనా బేగం (జహనుమా)-1.22, మీరజ్ మహ్మద్ (ఫతే దర్వాజ్)-1.34, మహ్మద్ గౌస్ (శాలిబండ)-1.31, మీర్ జఫర్ అలీ (హుస్సేన్ ఆలం)-1.00, సున్నం శ్రీలత (పురాన్‌పూర్)- 0.79, గఫర్ ఎం.ఎ (దూధ్‌బౌలి)-1.82, మహ్మద్ ముబీన్ (రసూల్‌పుర)-1.82, అజీజ్ బేగ్ (కిషన్‌బాగ్)-1.45, హబీబ్ జైన్ (శివరాంపల్లి)-3.00కోట్లు, ఫర్హానా బేగం (అత్తాపూర్)-3.36, అరుణ (కార్వాన్)-2.88, ఎస్రా సుల్తానా (దత్తాత్రేయనగర్)-1.36, మలేకొన్నియా బేగం (అసిఫ్‌నగర్)-1.27, మహ్మద్ జకీర్ బఖారీ(మురాద్‌నగర్)-1.8, బి.రవి యాదవ్ (లంగర్‌హౌజ్)-1.97, జాఫర్ హుస్సేన్ (టోలిచౌకి)-1.68, నజ్మా సుల్తానా (నానల్‌నగర్)-2.26, మహ్మద్ మజీద్ హుస్సేన్ (అహ్మద్‌నగర్)-2.17, మహ్సీనా పర్వీన్ (విజయనగర్ కాలనీ)-1.64, యాస్మినా సుల్తానా (చింతల్‌బస్తీ)-1.64, మహ్మద్ గౌస్ బాషా(మల్లేపల్లి)-1.6, జహీరాబేగం (రెడ్‌హిల్స్)-1.12, మహ్మద్ నజీరుద్దీన్ (జాంబాగ్)-1.75, ఫరూకుద్దీన్ (అంబర్‌పేట)-1.41 కోట్లు.


**నిజమైన మార్పు కోసం లోక్‌సత్తాను బలోపేతం చేయండి**

తమకు వచ్చిన నిధులు, చేసిన అభివృద్ధిపై తాజా మాజీ కార్పొరేటర్లు శ్వేతపత్రం ప్రకటించి ప్రజలకు జవాబు చెప్పాలని దేవీ ప్రసాద్, సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. వచ్చే మునిసిపల్ ఎన్నికలలో కూడా ఇలాంటి కార్పొరేటర్లనే ఎన్నుకుంటే మరోసారి ప్రజలు నష్టపోవాల్సి ఉంటుందని, సరైన విధానాలు, అభ్యర్థులు ఉన్న పార్టీని ఎన్నుకోవాలని హైదరాబాదీలకు విజ్ఞప్తి చేశారు. మంచి రాజకీయానికి నాంది పలకటంతోపాటు నిబద్ధత, సమర్థత గలవారు ఎన్నికవటంతోపాటు వారు తిరిగి దోపిడీ రాజకీయంలో కూరుకుపోకుండా ఆటగాళ్లతోపాటు ఆట నియమాలనూ మార్చే తగిన విధానాలతో కొత్త రాజకీయ సంస్కృతికి వేదికగా ఉన్న లోక్‌సత్తాకు ప్రజలు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. యువత, మహిళలు, మధ్యతరగతివారు వలంటీర్లుగా కొంత సమయాన్ని, విరాళాలుగా కొన్ని వనరుల్ని ఇచ్చి లోక్‌సత్తాను బలోపేతం చేయాలని, తమ జీవితాల్లో నిజమైన మార్పును సాధించుకోవటానికి ప్రజలు లోక్‌సత్తాను గెలిపించాలని దేవీ ప్రసాద్, సాంబిరెడ్డి కోరారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు రామచందర్, రామన్న తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ★

# హైదరాబాద్‌లో హోర్డింగుల్ని, ప్రచార బోర్డుల్ని కబ్జా చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం

హైదరాబాద్ నగరంలోని హోర్డింగ్‌లను అధికార తెలంగాణ రాష్ట్ర సమితి కబ్జా చేసిందని లోక్‌సత్తా పార్టీ నేతలు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో హోర్డింగ్‌లను ప్రదర్శిస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాల్ని కేవలం వ్యక్తిగత, తెరాస పార్టీ ప్రచారానికి వినియోగించుకున్నారని, అందుకోసం కోట్ల నిధుల్ని వృథా చేశారని, ఇప్పుడు ప్రతిపక్షాలకి అవకాశం లేకుండా నగరమంతా హోర్డింగ్‌లను, బస్‌షెల్టర్ బోర్డుల్ని ఆక్రమించేశారని అన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కోట్ల ఖర్చుతో ప్రచారాన్ని విస్తరించకుండా చర్యలు తీసుకోవలసిందిగా లోక్‌సత్తా పార్టీ నేతలు సోల్కర్ రెడ్డి, సాంబిరెడ్డి, దేవీప్రసాద్, రామన్న, నర్సింహారావు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల్ని వారం మధ్య సెలవల్లేకుండా పనిదినాల్లో నిర్వహించాలని వారు ఎస్ఈసీని కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని ప్రారంభించటం పట్ల అభినందించారు. అనంతరం లోక్‌సత్తా నేతలు మీడియా ద్వారా ప్రజలకు వివరాల్ని




తెలియచేస్తూ, ప్రభుత్వానికి, పార్టీకి, నాయకుడి వ్యక్తిగతానికి తేడా లేకుండా చేసి ప్రజాధనాన్ని ప్రచారానికి తెరాస ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్న తీరుని ఇప్పటికే పలుమార్లు బైటపెట్టామని, గ్రేటర్ ఎన్నికల్లో కేవలం పైస్థాయి ప్రచారానికే రూ. 6కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఈ నిధులు ఎక్కడ్నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలు కూడా ఇలాంటి లేకి, భూస్వామ్య, ఆర్భాటపు రాజకీయాలను తిప్పికొట్టి పౌరుల చుట్టూ తిరిగే లోక్‌సత్తా కొత్త రాజకీయానికి మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ★

# ప్రకటనల్లో, బిల్లుల్లో ఘనం, పిల్లల పళ్లాల్లో అధ్వాన్నం: హాస్టళ్ల తీరుపై లోక్‌సత్తా ధ్వజం

వసతి గృహాల్లో చదువుకుంటున్న పిల్లలకు ఇస్తున్న ఆహారం ప్రకటనల్లో, బిల్లులో చెల్లింపుల్లో గొప్పగా ఉంది తప్ప పిల్లల పళ్లాల్లో అధ్వాన్నంగా ఉందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి సాతులూరు గోవిందరావు అన్నారు. కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలోని ఎస్టీ హాస్టల్‌ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న వసతుల్ని, భోజనాన్ని పరిశీలించారు. లెక్కల్లో సన్నబియ్యం అని చూపిస్తూ దూగర ఉన్న ముక్కబియ్యాన్ని తీసుకొచ్చి పెడుతున్నారని





గోవిందరావు అన్నారు. నాసిరకం ఉప్పులు, పప్పులు, కారం, కూరగాయలు, చింతపండులతో వండిపెడుతున్నారన్నారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహారమున్న దొడ్డుబియ్యం, ఇతర తృణధాన్యాల్ని వాడేలా ప్రభుత్వం ప్రోత్సహించకుండా సన్నబియ్యం అంటూ ఆర్భాటం చేసిందని, క్షేత్రస్థాయిలో అసలు పిల్లలకు పనికొచ్చే ఆహారమే లేకుండా పోతోందన్నారు. చాలా వసతి గృహాల్లో ఇదే ఆహారాన్ని అందిస్తున్నారని, తమదేం తప్పు లేదని ఇంఛార్జి చెబుతున్నారని, ప్రభుత్వం వెంటనే తనిఖీలు చేపట్టి వసతి గృహాలను ఆడిట్ చేయాలని, వాటిని మంచి విద్యకు కేంద్రాలుగా తయారుచేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ నేతలు రవికుమార్, శెట్టి నరేంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ★




# కేసీఆర్ సొంత ముద్ర కోసం పాకులాడకుండా 'ప్రతి హైదరాబాదీకి పక్కా సొంతిల్లు' పాలసీని రూపొందించాలి: లోక్‌సత్తా

ప్రతి పేదవానికీ రుణభారమన్నదే లేకుండా సొంతింటిని అందిస్తానని ఎన్నికల హామీలలో భాగంగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రతి మీటింగ్‌లో చెప్పిన మాట పేరు కోసం పాకులాట, ముందుచూపు లేకపోవటం వల్ల నీటి మూటగానే మిగిలిపోతోందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, సహ కార్యదర్శి దేవీ ప్రసాద్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి అన్నారు. 2లక్షల డబుల్ బెడ్ రూంలు ఇస్తామన్న కేసీఆర్, ఇప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తుండటంతో హడావుడిగా శంకుస్థాపనలు నిర్వహిస్తున్నారన్నారు. నిజంగా పేదలందరికీ సొంతిళ్లు ఇవ్వాలన్న సంకల్పం ఉంటే తెరాస సర్కారు తీరు ఇలా ఉండేది కాదన్నారు.

గతంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రాజీవ్ ఆవాస్ యోజన ద్వారా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌కు 52843 ఇళ్లు మంజూరుకాగా, 18459 మంది 10శాతం డబ్బులు కట్టారని, సొంతపేరు కోసం ఉచిత ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిన కేసీఆర్ ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ముందు ఈ పదిశాతం కట్టినవారికి ఇప్పటికే కట్టిన ఇళ్లను పట్టాలతో సహా ఇవ్వాలని లోక్‌సత్తా నేతలు డిమాండ్ చేశారు. పేదలకు ఉచిత డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామంటే లోక్‌సత్తా చాలా సంతోషిస్తుందని, అయితే సొంతింటి నిర్మాణంలో లబ్ధిదారుల భాగస్వామ్యం కూడా ఉంటే నాణ్యత పెరిగి కేసీఆర్ ప్రభుత్వానికి ఇంకా పేరు వస్తుందని, అందుకే పదిశాతం చెల్లించే పాత పథకాల ఇళ్లను తక్షణం మంజూరుచేయాలన్నారు. కొంచెం ముందుచూపుతో వ్యవహరించి ప్రస్తుతం ఆకర్షణీయంగా ప్రకటించిన ఉచిత డబుల్ బెడ్‌రూం పథకంలో కూడా ప్రజల భాగస్వామ్యానికి చోటు కల్పించేలా 10శాతం చెల్లింపు నిబంధనను చేర్చాలన్నారు. ప్రభుత్వ కట్టడాలు నాసిరకంగా ఉంటాయన్న భావన వల్ల, ప్రభుత్వమే అన్ని నిర్ణయాలూ తీసుకుని కట్టించి ఇవ్వటం వల్ల, ఎంత అద్భుతంగా ఉచిత ఇళ్లను కట్టించినా ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోకతప్పదన్నారు. అందుకే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను, సొంత ముద్ర వేయాలన్న తపనను కొంతైనా పక్కనబెట్టి ప్రభుత్వం 'ప్రతి హైదరాబాదీకి పక్కా సొంతిల్లు' సమగ్ర హౌసింగ్ పాలసీని అమలు చేయాలన్నారు.

సమాచార హక్కు చట్టం ద్వారా జీహెచ్ఎంసీ హౌసింగ్ విభాగం నుంచి లోక్‌సత్తా సేకరించిన వివరాల ప్రకారం, జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే, రే ద్వారా గ్రేటర్ హైదరాబాద్‌లో మంజూరైన ఇళ్లకు రూ. 1165.72 కోట్లు బడ్జెట్ మంజూరుచేయగా, ఇప్పటికి 817 కోట్లు ఖర్చయిందని సోల్కర్, దేవీ ప్రసాద్, సాంబిరెడ్డి తెలిపారు. మొత్తం 52,843 ఇళ్లలో 40,395 పూర్తికాగా, 10,440 ఇళ్ల పని జరుగుతోందని, 1944 ఇళ్లు ఏమయ్యాయో లెక్కలలో లేదన్నారు. 21,389 ఇళ్లు ఇచ్చామని, 18,459 మంది 10శాతం కట్టారని, 18559 మంది రూపాయి కూడా కట్టలేదని, 15969 ఇళ్లు చాలాకాలం నుంచి ఎవరికీ ఇవ్వకుండా ఉన్నాయని సమాచారం వచ్చిందన్నారు. ఈ పేదలు నెలకి రూ. 2,000 అద్దె కడుతున్నా ఏడాదికి రూ. 75 కోట్లు అవుతుందని, ఈ లెక్కన ప్రభుత్వ అసమర్థతతో నిర్మాణంలో జాప్యం వల్ల అన్నిరకాలుగా సుమారు రూ. 800 కోట్లు పేదలు నష్టపోయారన్నారు. రాజీవ్ ఆవాస యోజన కింద సుమారు రూ. 3కోట్ల రూపాయలు ప్రాజెక్టు రిపోర్టు కోసం ఖర్చు పెట్టిన ప్రభుత్వం కేవలం రూ. 2 కోట్లుతో

మాత్రమే ఇళ్లు కట్టించిన ఘనత ఆ పాలకులదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కాస్త విజ్ఞతతో వ్యవహరించి కేవలం రూ.160 కోట్లు ఇస్తే 10శాతం చెల్లించిన అందరికీ ఇళ్లు ఇచ్చేయచ్చాన్నారు. అయితే, జీహెచ్ఎంసీ లెక్కలకు, కలెక్టర్ కార్యాలయం లెక్కలకు ప్రతి కాలనీలో డబ్బు చెల్లింపు, ఇళ్ల కేటాయింపు లెక్కలలో పెద్దసంఖ్యలో తేడాలున్నాయని, ఉదాహరణకి బహదూర్‌పల్లిలో జీహెచ్ఎంసీ లెక్కలు 2,144 మందికి ఇళ్లు ఇచ్చామని ఉంటే, రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం లెక్కలు 2,076 మాత్రమే ఇచ్చినట్టు చూపుతున్నాయని తెలిపారు. బౌరంపేటలో 2,418 మందికి ఇళ్లు ఇచ్చినట్టు జీహెచ్ఎంసీ చెబుతుంటే, కలెక్టర్ కార్యాలయం 2,450 మందికి ఇచ్చినట్టు చెబుతోందని, గంథంగూడ-ఫేజ్ 3లో 68 ఇళ్లు, కోకాపేట్-ఫేజ్ 2లో 78 ఇళ్లు ఇచ్చామని కలెక్టర్ లెక్కలు చెబుతుంటే, జీహెచ్ఎంసీ లెక్కలు మాత్రం ఎవరికీ ఇవ్వలేదని చూపుతున్నాయన్నారు. కలెక్టర్ ఆఫీసు లెక్కల్లోనే తుర్కయాంజల్-ఫేజ్ 2లో 24 ఇళ్లు ఎక్కడికి పోయాయో తెలియని పరిస్థితి అన్నారు. వీటన్నిటిపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేయాలన్నారు.

కేసీఆర్ హైదరాబాద్‌ని సింగపూర్ చేస్తానంటున్నారని, సింగపూర్‌లో 95శాతం మందికి సొంత ఇళ్లు ఉన్నాయని, 80శాతం ఇళ్లను 1959-69 కాలంలో, అంటే పదేళ్లలోనే ప్రభుత్వమే 60శాతం సబ్సిడీతో నిర్మించిందని సాంబిరెడ్డి గుర్తుచేశారు. ప్రతి కాలనీలో 9శాతం భారతీయులు, 33శాతం చైనా తదితర దేశాలవారు ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో 12లక్షల మందికి మాత్రమే ఇళ్లు ఉన్నాయని, ఇంకా సుమారు



10లక్షల మంది అద్దెకు ఉంటున్నారని, వారందరికీ సింగపూర్‌లోలాగా రానున్న రోజుల్లో ఏర్పాటు చేయాలన్నారు.

వివిధ పథకాల కింద ఇప్పటికే కట్టిన ఇళ్లలో అవసరమైతే దెబ్బతిన్నవాటిని మరమ్మతులు చేసి 10శాతం డబ్బులు కట్టిన 18,459మందికీ వెంటనే పట్టాలతో సహా ఇళ్లు ఇవ్వాలని, పాత పథకాల కింద నిర్మాణంలో ఉన్న 10,440 ఇళ్లను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని, లేకుంటే కలెక్టర్ ఆఫీసుల్ని లోక్‌సత్తా ముట్టడిస్తుందని లోక్‌సత్తా నేతలు అన్నారు.

తెరాస ప్రభుత్వ ఇళ్ల నిర్మాణ విధానాన్ని నిరసిస్తూ, ప్రజాధనంతో కట్టిన 36,000 ఇళ్లు వృథా కాకూడదంటూ, లోక్‌సత్తా పార్టీ ఆల్విన్ కాలనీ అధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, లింగరాజు, నరసింహారావు తదితర నేతలు, కార్యకర్తలతో కలిసి సోల్కర్‌రెడ్డి, దేవీ ప్రసాద్, సాంబిరెడ్డి ఎల్లమ్మబండలో ఉన్న 2300 జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకు, ఫూల్‌బాగ్ వద్దనున్న 512 ఇళ్లకు ప్రారంభోత్సవం చేశారు. ★

# జనచైతన్య యాత్రల వల్ల ఏం ఒరిగింది?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన జనచైతన్య యాత్రల వల్ల ఒరిగేదేమీ లేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ జిల్లా వెనకబాటుకు గురైందని, ప్రజలు మంచివారని కితాబులివ్వటం తప్ప సహాయం అందించటం లేదన్నారు. అభివృద్ధి లేదన్నారు. కనీసం ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలపై కూడా సీఎం స్పందించటం లేదన్నారు. జిల్లాలో జూట్, ఫెర్రో పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడితే కనీసం వారిని ఆదుకునే పరిస్థితి లేదన్నారు. మిల్లులు తెరిపించలేకపోయిన ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. పదేపదే రైతుల గురించి మాట్లాడే చంద్రబాబు.. కనీసం స్థానిక సాగు అవసరాల గురించి పట్టించుకోకుండా రైవాడ, తాటిపూడి నుంచి నీటిని తరలిస్తున్నారన్నారు. జిందాల్ అల్యూమినా కర్మాగారంలో అవినీతిని లోక్‌సత్తా రుజువు చేసినా దోషులపై చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఎస్.కోట, జామి ప్రాంతాలలో జూనియర్ కళాశాలల్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరినా పట్టించుకోలేదని, ఇక జనచైతన్య యాత్రలు ఎందుకని ప్రశ్నించారు. పార్టీ నాయకులు శివరామారావు, సుధాకర్, కోటేశ్వరరావుతో కలిసి బాబ్జీ మీడియాతో మాట్లాడారు. ★

# కార్పొరేటర్ల ప్లేటు భోజనం రూ.2000

## ఇలాంటి కార్పొరేటర్లను ఎందుకు ఎన్నుకున్నామో ప్రజలే ఆలోచించుకోవాలి: లోక్‌సత్తా

**కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి 2009 ఎన్నికలలో గెలిచిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు ఎన్నికయ్యాక లక్షలు ఖరీదు చేసే కార్లలో తిరుగుతూ జనం సొమ్ముతో ఎలా జల్సా చేశారో, ఎలా సొంత సోకులు సమకూర్చుకున్నారో తరచి చూస్తుంటే దిగ్భ్రాంతి కలుగుతోందన్నారు.**

గౌరవ వేతనంగా నెలకు రూ.4,000 మాత్రమే తీసుకున్నామని చెప్పుకున్న గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్లు అధికారిక సమావేశాల్లో ప్లేటు భోజనానికి గరిష్ఠంగా రూ.2,000 జనం సొమ్ము ఆరగించారని, ప్రజలకు వైద్యసేవలు అందించకుండా తమ సొంత మెడికల్ ఇన్సూరెన్స్‌కి రూ.72 లక్షలు, ఫోను బిల్లులకు రూ.186 లక్షల ప్రజల సొమ్మును హాంఫట్ అనిపించారని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది.

పార్టీ నేతలు దేవీప్రసాద్, సురేంద్రతో కలిసి లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి ఇక్కడ అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రూ.15 సబ్సిడీతో పేదలకు పెడుతున్న రూ.5 భోజనాన్నే కార్పొరేటర్లకు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అదే భోజనాన్ని కార్పొరేటర్లకీ, జీహెచ్ఎంసీ ఇతర సమావేశాల్లోనూ పెట్టివుంటే ప్రజలకు అందించే పథకంలోనూ నాణ్యత ఇంకా పెరిగి ఉండేదని, కనీసం రూ.35 లక్షల ప్రజాధనం ఆదా అయివుండేదని అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి 2009 ఎన్నికలలో గెలిచిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు ఎన్నికయ్యాక లక్షలు ఖరీదు చేసే కార్లలో తిరుగుతూ జనం సొమ్ముతో ఎలా జల్సా చేశారో, ఎలా సొంత సోకులు సమకూర్చుకున్నారో తరచి చూస్తుంటే దిగ్భ్రాంతి కలుగుతోందన్నారు. రూ.366 లక్షలు ఖర్చు పెట్టి మన తాజా మాజీ కార్పొరేటర్లు సిమ్లా, డార్జిలింగ్, గాంగ్‌టక్, కాశ్మీర్ వెళ్లింది విహారయాత్రలకా లేక రోడ్లు, డ్రైనేజీ, ఘనవ్యర్థాల నిర్వహణను అధ్యయనం చేయటానికా? వీళ్లు చేసిన స్టడీ ఏమిటో గుంతలమయమైన మన రోడ్లు, మురికినీటి ప్రవాహంగా మారిన మన కాలనీలు, చెత్తకుప్పలు, దోమల వల్ల సీజన్‌లతో పనిలేకుండా స్వైన్‌ఫ్లూ, డెంగీ భయంతో వణికిపోతున్న ప్రజల్ని చూస్తే అర్థమవుతుందన్నారు.

పేపర్‌లెస్ సర్వీసుల కోసమంటూ కోటి రూపాయలు ఖర్చు పెట్టి ల్యాప్‌ట్యాపులు కొనిపించిన మన కార్పొరేటర్లు మళ్లీ కొరియర్ సర్వీస్ కోసమంటూ లక్షా75వేలు ఖర్చు చేయటం వారి ఘరానా రాజకీయానికి అద్దం పడుతుందని సాంబిరెడ్డి అన్నారు. తమ ఆటల కోసం కోటిరూపాయల ప్రజాధనాన్ని పందేరం చేశారు తప్ప మంజూరైన స్టేడియంల నిర్మాణాన్ని, కాలనీల్లో, బస్తీల్లో ఆటస్థలాల ఏర్పాటును కార్పొరేటర్లు పట్టించుకోలేదన్నారు. ప్రతి డివిజన్‌లో కార్పొరేటర్ ఆఫీసు ఏర్పాటు కోసం రూ.3 కోట్లు వెచ్చించిన తాజా మాజీ కార్పొరేటర్లు, తమకు కేటాయించిన రూ.690 కోట్ల అభివృద్ధి నిధులలో మాత్రం రూ.239 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి రూ.451 కోట్లు మురగబెట్టారన్నారు. సామాన్య ప్రజల్ని వేధిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని ప్రశ్నించకుండా అందులో భాగంగా మారారన్నారు. "లోక్‌సత్తా పార్టీకి ఓటు వేస్తే వేస్టు అన్న పార్టీల కార్పొరేటర్ల నిర్వాకమిది, ఇలాంటి కార్పొరేటర్లను ఎందుకు ఎన్నుకున్నామో ప్రజలే ఆలోచించుకోవాలి" అని బొంతు సాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

**జీహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ల ఖర్చు వివరాలు :**

ల్యాప్‌ట్యాప్ అండ్ ప్రింటర్: రూ.1కోటి

టెలిఫోన్ బిల్లులు: రూ.1కోటీ 86 లక్షలు

మెడికల్ ఇన్సూరెన్స్: రూ.72 లక్షల 86 వేలు

హ్యాండీకామ్: రూ.31 లక్షలు

స్టడీ టూర్స్: రూ.3 కోట్ల 66 లక్షలు

కొరియర్: 1లక్షా 75 వేలు

కౌన్సిల్ సమావేశాల్లో భోజనాలు: రూ.42 లక్షల 13 వేలు

కార్పొరేటర్ ఆఫీసులు: రూ.3 కోట్లు

మేయర్ అమెరికా పర్యటన: రూ.1కోటి

కార్పొరేటర్ల ఆటలపోటీలు: రూ.1 కోటి

ఐప్యాడ్స్: రూ.72 లక్షలు (హైకోర్టు మొట్టికాయలతో వెనక్కి తగ్గారు) ★

### కాపాడవలసిన వారే దోచుకుంటున్న వికృతం విజయవాడ కాల్‌మనీ,

# ప్రక్షాళన లేని అరెస్టులు, విచారణలు నాటకాలే : జేపీ



ప్రజల్ని రక్షించాల్సిన రాజకీయ, పోలీసు వ్యవస్థలు వారిని ఎలా భక్షిస్తున్నాయో విజయవాడ కాల్‌మనీ దుర్మార్గం బైటపెడుతోందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక సామాజిక రుగ్మతలా మారి కుటుంబాల్ని కబళించే స్థాయికి అది విస్తరించటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక పౌరునిగా, పౌరసమాజ, రాజకీయ ఉద్యమకారునిగా సిగ్గుపడుతున్నానన్నారు. విజయవాడ కాల్‌మనీ విషవలయం మొక్కుబడి అరెస్టులు, నాలుగు రోజుల హడావుడితో పరిష్కారమయ్యే అంశం కాదని, దీనివెనక రాజకీయ చెద పట్టిన వ్యవస్థ ఉందన్నారు. పరపతి వ్యవస్థను బాగుచేయటం, ఎన్నికలలో విచ్చలవిడి డబ్బు నియంత్రించటం, దోషులకు ఖచ్చితంగా కఠినశిక్ష పడేలా చట్టబద్ధ పాలన అమలు లేకుండా ప్రభుత్వం కేవలం విచారణ ప్రకటనలు, నిఘావ్యవస్థపై నిందలకు పరిమితమవటం నాటకాలాడటమేనన్నారు.

**పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములుగా ఉన్న కాల్‌మనీ అత్యాచారాలపై బేగంపేట కార్యాలయంలో తనను కలిసిన మీడియాతో జేపీ మాట్లాడుతూ,** లేని ఆదాయంతో రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికైన ప్రభుత్వం మొత్తం పరపతి వ్యవస్థను నాశనం చేసిందని, దానివల్ల అక్కడ ఆ పార్టీకి ఓట్లు వచ్చాయిగానీ, రైతులు, ఇతర పేద, మధ్యతరగతి వర్గాలకు అప్పు దొరకటం కష్టమైపోతోందని అన్నారు. చాలా కాల్‌మనీ కేసుల్లో తనఖా పెట్టి మరీ బాధితులయ్యారని, అల్పాదాయ వర్గాలకు తనఖా ఉన్నా కూడా బ్యాంకులు రుణమివ్వక పోవటానికి 'అప్పులు ఎగ్గొట్టండి' అనే తప్పుడు రాజకీయమే కారణమన్నారు. అప్పిచ్చువాడు, వైద్యుడు లేని చోట ఉండకూడదని పెద్దలు చెబుతారని, కానీ అప్పు తీసుకుంటే బానిసలుగా మారిపోయే దుస్థితిని పాలకులే ప్రజలకు కల్పించారని అన్నారు. రైతులకు నిజమైన భరోసా ఇచ్చే పంట ప్లెడ్జి రుణాల్ని ప్రభుత్వం ఒక్కచోట కూడా ఇప్పించలేకపోయిందన్నారు. రుణమాఫీ వల్ల రైతులకు మేలుజరగకపోగా పరిస్థితులు మరింత దిగజారతాయని ఎన్నికల సమయంలో కూడా లోక్‌సత్తా విస్పష్టంగా చెప్పిందని, ఇప్పటికైనా ఎ.పి ప్రభుత్వం పరపతి వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, ప్రజలకు అందుబాటులో, ఆత్మగౌరవంతో రుణం అందే ఏర్పాటు చేయాలన్నారు. ఎ.పి రుణచట్టంలో బ్యాంకులకన్నా




అదనంగా 2శాతం అని అస్పష్టంగా ఉందని, ప్రభుత్వం వెంటనే ఆ చట్టాన్ని సవరించి వడ్డీ రూ. 1.50–2.50కి మించకుండా చట్టం చేయాలన్నారు. తీవ్రత తక్కువైనా తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉందని, కరీంనగర్‌లో ఒక హెడ్‌కానిస్టేబుల్ కొందరు పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల అండతో వందల కోట్ల వడ్డీ వ్యాపారం చేస్తున్న కేసులో లోక్‌సత్తాను బాధితులు ఆశ్రయించిన వైనాన్ని గుర్తుచేశారు. 1930లలో అమల్లోకొచ్చిన వడ్డీ చట్టమే (1349 ఫస్లీ) ఇప్పటికీ




తెలంగాణలో కొనసాగుతోందని, ఎ.పితోపాటు తెలంగాణలో కూడా వడ్డీరేట్లను నియంత్రించేలా పరపతి చట్టాన్ని తేవాలన్నారు.

మరోవైపు, రుణమాఫీలు వంటి తాత్కాలిక తాయిలాలతోపాటు ఎన్నికలలో ఇష్టమొచ్చినట్టు డబ్బు ఖర్చు పెట్టి నెగ్గినవారు, కొన్ని ఓట్ల తేడాతో ఓడిపోయిన వారు కూడా.. తమను డబ్బు తీసుకుని గెలిపించారు తప్ప ఊరికే గెలిపించలేదని, ప్రజల వల్ల తమ డబ్బు వృథా అయిందనే కసితో ప్రజల్ని పురుగుల్లా చూస్తూ ఎంత అమానుషమైన వ్యాపారాలకైనా తెగబడుతున్నారని జేపీ అన్నారు. దీనివల్లే కాల్‌మనీ, కల్తీ మద్యం వంటివి వికృత రూపంతో విస్తరిస్తున్నాయన్నారు.

**పదవుల నుంచి తొలగించాలి,**

**ఏ పార్టీకి చెందినవారైనా జైలుకి పంపి ఆస్తుల్ని జప్తు చేయాలి**

వడ్డీ వ్యాపారం ముసుగులో మహిళల్ని సెక్స్ రాకెట్ ఊబిలో దించిన ఘటనలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ఉన్నా, జిల్లా పరిషత్‌లో ఉన్నా వారిని పదవుల నుంచి తొలగించాలని జేపీ అన్నారు. ఏ పార్టీకి చెందినవారైనా దోషులకు జైలు శిక్ష పడాలి, వారి ఆస్తుల్ని జప్తు చేయాలన్నారు. ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకున్నప్పుడు, పూర్తిగా పెత్తనం చెలాయించే ప్రయత్నం చేస్తున్నప్పుడు ఆ పోలీసు యంత్రాంగం నిజాయతీగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి అవినీతిపరులను పట్టుకుని శిక్షిస్తుందన్న విశ్వాసం ప్రజలకు ఎలా కలుగుతుంది? అని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసి, చట్టబద్ధ పాలన లేకుండా చేసి బడితె ఉన్న వాడిదే బర్రె లెక్కన వ్యవస్థను తయారు చేశారన్నారు. అవినీతిమయమైన వ్యవస్థలో తాత్కాలిక తాయిలాల ఊబిలో ప్రజలు చిక్కుకున్నప్పుడు ఏదోకరూపంలో




విజయవాడ కాల్‌మనీ వికృత దందా వంటి ఘటనలు చోటు చేసుకుంటాయన్నారు.

**బాధితుల ఆస్తుల్ని తిరిగి ఇప్పించాలి**

కాల్‌మనీ అక్రమాలు పలుచోట్ల జరుగుతున్నప్పటికీ విజయవాడ ఘటన చాలా తీవ్రమైనదని, ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థల్ని నాశనం చేసేదని జేపీ అన్నారు. ప్రభుత్వ వ్యవస్థ సక్రమంగా లేనప్పుడు ప్రజలు అవసరాలకి వడ్డీ ఎంతైనా అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితులే ఉంటాయన్నారు. విజయవాడ దందాలో లక్షన్నర అప్పు తీసుకున్నవారు రూ. 9లక్షలు వడ్డీ కట్టినట్టు వార్తాకథనాల్లో చూశాను, ఇంతకంటే దారుణ విషయం ఏముంటుంది? అన్నారు. ఇలాంటి అప్పులన్నిటినీ రద్దు చేయాలని, అప్పు భారాన్ని మించి చెల్లించినప్పుడు అదనంగా డబ్బు తిరిగి చెల్లించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టంతో చర్యలు చేపట్టాలని జేపీ డిమాండ్ చేశారు.

విజయవాడ కాల్‌మనీ కేసులో బాధితులకు నిజంగా న్యాయం చేస్తామని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, పరపతి వ్యవస్థను బాగుచేయటంతోపాటు, ఎన్నికలలో తాత్కాలిక తాయిలాలు, డబ్బు ప్రభావాన్ని నియంత్రించేందుకు ఖచ్చితమైన మార్పుల్ని తీసుకోవాలని, మహిళల్ని అంగడి సరకుగా తయారుచేసే స్థాయికి దిగజారిన నేతలకు ఉరిశిక్ష పడేలా చేయాలని జేపీ డిమాండ్ చేశారు.

ఇందులో సమాజం బాధ్యత కూడా ఉందని, ఓటు కన్నా కులం, మతం, ప్రాంతం, తాయిలాలు ఎక్కువైపోవటం, పెళ్లిళ్ల వంటి కార్యాలకు తాహతుకి మించి ఖర్చు కోసం అప్పులు చేయటం వల్ల మన జీవితాలను, బిడ్డల భవిష్యత్తును మనమే దెబ్బతీసుకుంటున్నామని ఇప్పటికైనా ప్రజలు గుర్తించాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ★

# నిర్భయ చట్టం అమలు అరకొర, నిధి వినియోగం శూన్యం: లోక్‌సత్తా నిరసన ప్రదర్శనలు

నిర్భయ చట్టం అమలుకు మౌలిక సదుపాయాల్ని ఏర్పాటు చేయటంలో, బాధిత మహిళలకు అండగా నిలిచి అత్యాచారాల నిరోధానికి కృషి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన నిర్భయ నిధిని వినియోగించటంలో పాలకులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ నేతలు అన్నారు. మూడేళ్ల క్రితం ఏటా రూ.1000కోట్లు చొప్పున నిర్భయ నిధి ఏర్పడినా ఇప్పటివరకూ రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటానికి ఒక సంకేతంగా ఉన్న నిర్భయ డే (డిసెంబర్ 16) రోజున ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సత్తా నిరసన కార్యక్రమాలను నిర్వహించింది. నిర్భయ తరహా ఉదంతాలు ప్రతిచోటా జరుగుతున్నా, అణగారిన వర్గాలలో ఎక్కువమంది ఇందుకు బలవుతున్నా ప్రభుత్వాలు చట్టం అమలుకు సరైన ఏర్పాట్లు చేయటం లేదని పార్టీ నేతలు అన్నారు. మన పక్కన ఉన్న కర్ణాటక, కేరళ రాష్ట్రాలు పోలీస్ కంట్రోల్ రూం కాల్‌సెంటర్, సీసీ టీవీ, మ్యాపింగ్ వంటి వాటి కోసం రూ.94 కోట్లు, 192 కోట్లు ప్రతిపాదనలు పంపారని, కానీ తెలంగాణలో నిర్భయ నిధి గురించే తెలియదన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని, మహిళా భద్రతకు నిధులు తెచ్చుకోవటంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని రాష్ట్ర నేతలు అన్నారు.

**ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లోక్‌సత్తా నేతలు కొన్ని డిమాండ్లు చేశారు :**

1) ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలి

2) అన్ని నగరాలు, పట్టణాల్లోని ముఖ్యప్రదేశాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి

3) ప్రస్తుతమున్న మహిళా పోలీసుల సంఖ్యను 6.3శాతం నుంచి 15శాతానికి పెంచాలి. కాస్త అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ శాతం 20-30గా ఉంది.

4) లైంగిక వేధింపులు, ఆడపిల్లలను సమానమైనవారిగా గౌరవించటంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు బోధించాలి.




హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోసపాటి రాము, బంతు సాంబిరెడ్డి, నాయకులు భవానీ, జగన్ మెట్ల, దేవీప్రసాద్, దుర్గారావు తదితరులు పాల్గన్నారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

**కాల్‌మనీ నిందితులపై నిర్భయ చట్టం కూడా ప్రయోగించి కఠినాతి కఠిన శిక్షలు విధించాలి.**

ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, కాల్‌మనీ వ్యవహారంలో మహిళలపై అకృత్యాలకు పాల్పడ్డ తెలుగుదేశం, కాంగ్రెస్, వైకాపా తదితర పార్టీల నాయకులపై నిర్భయ చట్టం కింద కూడా చర్యలు తీసుకోవాలని, సాక్ష్యాలు తారుమారుకాకుండా పకడ్బందీగా విచారణ చేసి కఠినాతి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ★

# న్యాయానికి అడ్డుపడటం, దిగజారి మాట్లాడటం కేజ్రీవాల్‌కు తగదు : జేపీ



అవినీతి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో సీబీఐ సోదాలు జరపటంపై జరుగుతున్న మాటల యుద్ధం హుందాతనం లేకుండా, చట్టబద్ధ పాలనను దిగజార్చేలా ఉందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సాక్ష్యాధారాల్ని సేకరించి కోర్టుల్లో నిరూపించటం సీబీఐ చేయాలితప్ప, అందులో ప్రభుత్వాలకేమీ సంబంధం ఉండదన్నారు.





పాథమిక ఆధారాలతో ఆరోపణలొస్తే వ్యవస్థ తగుచర్యలు తీసుకోవాల్సిందేనని, చౌకబారు రాజకీయాలకు ఆస్కారం ఉండకూడదని స్పష్టంచేశారు. సీబీఐ చర్యలపై అనుమానాలుంటే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సమీక్షించవచ్చని జేపీ అన్నారు. నిందితుడు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవటానికి అన్ని అవకాశాలూ ఉంటాయన్నారు.

న్యాయానికి అడ్డుపడటం, ప్రధాన మంత్రిని అవమానించటం కేజ్రీవాల్‌కు తగదని జేపీ అన్నారు. టీవీలు, ట్విట్టర్‌లు కేసుల్ని నిర్ణయించలేవన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో చట్టబద్ధపాలనను దిగజార్చారని, ఇప్పటికైనా లోక్‌పాల్‌ను ఏర్పాటు చేసి చట్టం ముందు అందరూ సమానమే అని ప్రజల్లో భరోసా కల్పించాలని అన్నారు. అకారణంగా చీటికీమాటికీ రభస చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించటంతో పాటు విశ్వసనీయతనూ దెబ్బతీసుకుంటోందని, అధికారంలో ఉన్నవారు మరింత విజ్ఞతతో, హుందాతనంతో వ్యవహరించాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ★

# వరద బాధితుల్ని ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం: సురేన్





వరద బాధితులను ఆదుకోవటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ అన్నారు. కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో ముంపు ప్రాంతాలలో పర్యటించానని, బాధితులకు సరైన సహాయక చర్యలు అందటం లేదని అన్నారు. రాజకీయ నాయకులు ఒక ఏడాది అనవసర విమాన ఖర్చులను ఇస్తే బాధితులకు చాలా మేలు చేయవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలకన్నా పాలకుల పాపం వల్ల ప్రజలు బాధలు అనుభవిస్తున్నారన్నారు. కావలి పట్టణ డంపింగ్ యార్డుల నిర్మాణం పంచాయతీల అనుమతి లేకుండా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయటం సరికాదని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అనేక చెరువులు ఉన్నాయని, పూడికలు తీయలేదని, చెరువులు, కాలువల్ని కబ్జా చేస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందని పార్టీ లీగల్ సెల్ జాతీయ కన్వీనర్ నాగేంద్రబాబు ప్రశ్నించారు. పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విషజ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ రాష్ట్ర నాయకుడు గడ్డం సతీష్ కుమార్ రెడ్డి మునిసిపల్ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. అన్నగారిపాలెం వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డు ఆపాలని కోరారు. దీనివల్ల 16 గ్రామాల ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. పట్టణంలో ఆక్రమణల్ని, ప్రధాన కూడళ్ల వద్ద విగ్రహాలను తొలగించాలని కోరారు. రైతులను నాసిరకం విత్తనాలతో మోసం చేస్తున్నవారికి పుట్టగతులుండవని హెచ్చరించారు. మూడేళ్లుగా అనావృష్టితో పశుపోషణలేక కూడా రైతులు కుదేలయ్యారని, వారి పట్ల ఉదారంగా వ్యవహరించాల్సిందిపోయి కొన్ని కంపెనీల అండతో దుకాణాలు నాసిరకం, నకిలీ విత్తనాలను అంటగడుతున్నాయని విమర్శించారు. ★

(జేపీ ఫోటో వాడాలి. వివేకానందుడి ఫోటో ఉంది)



# కులమత వివక్ష, విద్వేషం చూపేవారు వివేకానందుని మతస్తులు కాదు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఓ పక్క స్వామి వివేకానందుడి బొమ్మ, మరోపక్క హిందూత్వ పేరుతో దూషణలు, దాడులు, ఆహారపు అలవాట్లను శాసించటాలు జరుగుతూ హిందూమతాన్ని తాలిబనీ కరించేందుకు ప్రయత్నం ఒక వరవడిలా జరుగుతున్న ఈవేళ్టి తరుణంలో నిజంగా వివేకానందుడు చెప్పిన మతం ఏమిటో దేశ ప్రజలు మళ్లీ తెలుసుకోవటం, ఆలోచనల్ని పునరావిష్కరించుకోవటం అవసరం. జనవరి 12న ఆయన జయంతి కేవలం ఒక సాంకేతిక సందర్భం మాత్రమే.

కొన్ని వేల సంవత్సరాలుగా ఈ దేశంలో ఆధ్యాత్మికత ఎప్పుడూ వస్తూనే ఉంది. వివేకానందుడు కొత్తగా తీసుకురాలా. కానీ ఆ ఆధ్యాత్మికతకే కొత్త అర్థాన్ని తెచ్చిన మహనీయుడాయన. పేదలను విముక్తి చేసి, కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించటంలోనే నిజమైన మతసారాంశం ఉంటుందని చాటిచెప్పిన తొలి ఆధ్యాత్మిక నేత వివేకానంద. ఆధ్యాత్మికత అంటే ఎక్కడో ఉన్నాడో లేడో తెలియని దేవుడ్ని గురించి ఆలోచించటం కాదు. ఇక్కడున్న మనిషిని గూర్చి అని మనకి చాలా స్పష్టంగా ప్రబోధించారు వివేకానంద. కాలే కడుపుకి అన్నం పెట్టకుండా దేవుడ్ని గూర్చి మాట్లాడితే ప్రయోజనం ఏముంది సోదరా అని హెచ్చరించినవాడు ఆయన.

ఒక సందర్భంలో ఆయన అన్నారు..“ఒక చీమకే ఆలోచించే శక్తి ఉన్నట్లయితే, దేవుడ్ని ఒక మహాచీమగా ఊహించుకుంటుంది” అని. ఒక పెద్దచీమగా.. అలాగే మనిషి కూడా దేవుడ్ని నిర్మించుకున్నాడు. కానీ మనిషి జీవితాన్నే పట్టించుకోకపోతే, ఆ ఆధ్యాత్మికత వ్యర్థం అని చాలా స్పష్టంగా ప్రబోధించాడాయన.


రెండోది, ఆనాడు ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన జాతి మనది. కొన్ని వందల సంవత్సరాలుగా పరాయి పంచన బతుకుతూ, ఆత్మగౌరవాన్ని పోగొట్టుకుంటూ ఆత్మన్యూనతతో ఉన్నప్పుడు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు వివేకానంద. వలసవాదుల పాలనలో బానిసత్వ భావజాలంలో మగ్గుతున్న భారతీయులలో ఆత్మగౌరవం, హుందాతనం భావాల్ని వివేకానంద పునరుజ్జీవింప చేశారు. మన శరీరపు రంగు, విశ్వాసం సిగ్గుపడాల్సినవి కావని, మన వేల ఏళ్ల అవిచ్ఛిన్నమైన చరిత్ర, నాగరికత, సంస్కృతి మనందరం సగర్వంగా చాటుకోదగినవని తెలియచెప్పారు.



ఆయన అమెరికా వెళ్లినప్పుడు ఏ కాగితాలు, సిఫార్సులు పట్టుకోలా. నిజానికి ఆయన కొన్ని నెలల ముందే వెళ్లిపోయారు. ఎక్కడ ఉండాలో కూడా తెలీదు తనకి. కానీ తనలో ఉన్న జ్ఞానసంపద, ప్రపంచానికి తానివ్వాల్సిన సందేశం, మానవాళికి పనికివచ్చే బోధనలు ఆయన్ని ప్రేరేపించాయి. ఏనాడూ కూడా రేపెట్లాగా.. నన్నెవరైనా పట్టించుకుంటారా.. నా మాటలకు విలువుంటుందా.. ఏం చేద్దాం అన్న భయం, ఆందోళన ఆయనకు లేవు. ఈ జాతికి కూడా అదే నేర్పే ప్రయత్నం చేశాడాయన. ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో తలెత్తుకుని ఠీవిగా బతకండి, పిరికిపందల్లాగా బతక్కండి, మీ గతం గొప్పది, మీ సంప్రదాయం గొప్పది, మీ వర్తమానంలో కూడా చాలా పొరపాట్లుండొచ్చు, కానీ వాటిని సవరించే శక్తి మీకున్నది అని ప్రబోధించాడాయన. ఒకరకంగా ఆధునిక జాతీయతాభావానికి వివేకానంద పునాది వేశారు. భావిభారత నిర్మాణంలో యువతే కీలకమని వారి మీదే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి వివేకానంద పనిచేశారు. అందుకే ఒక ఆధ్యాత్మిక యోగిగా మాత్రమే కాకుండా ఒక జాతి నిర్మాతగా, ఈ దేశ ప్రజలకి ఆత్మగౌరవాన్ని ఇచ్చిన మహనేతగా వివేకానందుడి స్థానం భారతీయ సంప్రదాయంలో, ప్రపంచ సంప్రదాయంలో చిరస్థిర స్థాయిగా ఉంటుంది.

ఐదువేల ఏళ్ల అవిచ్ఛిన్నమైన చరిత్ర, సంప్రదాయం, నాగరికత మనకున్నాయి. ప్రపంచంలో అవిచ్ఛిన్నమైన చరిత్ర ఇంతకాలమున్నది మనకి, చైనాకు మాత్రమే. కానీ చైనా ఒకే ఒక్క సంప్రదాయం, ఒకే ఒక్క జాతి. హాన్ జాతి.. అత్యధికంగా. కానీ భారతీయ సంప్రదాయంలో ఎన్నో ప్రవంతులు అద్భుతంగా కలిసినాయి. 2600 సంవత్సరాల కిందటం మొట్టమొదట యూదులు ఈ దేశానికి వచ్చారు. అప్పటికే భారతీయ సంప్రదాయం చాలా ప్రాచీనమైనది. అప్పటినుంచి ఇప్పటిదాకా యూదులు ప్రపంచంలోనే ఎక్కడాలేనట్లుగా ఏ రకమైన హింసకీ, వివక్షకీ గురికాకుండా హాయిగా బతగ్గలుగుతున్నారు. జీసస్ క్రీస్తు శిలువనెక్కాక 20 ఏళ్లలోపు సెయింట్ థామస్ ఈ గడ్డ మీదకి వచ్చాడు. అప్పటి నుంచి ఇప్పటి దాకా సిరియన్ క్రైస్తవులు ఈ దేశంలో ఏరకమైన హింసకీ, వివక్షకీ గురికాకుండా ఉన్నారు. ఈవేళ క్రైస్తవానికి కేంద్రం అని చెప్పుకుంటున్న ఇటలీలలో క్రైస్తవం అంటే తెలియని కాలంలో భారతదేశానికి ఆ మతం సంప్రదాయం వచ్చి మిళితం అయిపోయింది. ప్రవక్త మహమ్మద్ మక్కా నుంచి మదీనా దాకా చేసిన ఆ ప్రయాణం క్రీశ 620లో జరిగాక, 90 ఏళ్లలోపలనే ఈ దేశంలోకి ఇస్లాం వచ్చింది. ఒక మతంగా రాలా.. నిజానికి ఇస్లాం మొట్టమొదట ఈ దేశంలోకి వచ్చింది 712లో. సింధ్ ప్రాంతానికి వచ్చింది. మనకు అరేబియాతో గొప్ప వాణిజ్యం ఉండేది ఆరోజుల్లో. కానీ సముద్రపు దొంగలు ఆ వాణిజ్యాన్ని అడ్డుకోవటంతో అక్కడి ఖలీఫా పంపించాడు ఖాసిం అనే ఓ కుర్రాడ్ని. అతనొచ్చి సింధ్‌ని ఆక్రమించి అక్కడ వాణిజ్యానికి, వ్యాపారానికి ఇబ్బందిలేకుండా చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఇస్లాం ఏ అడ్డకులు లేకుండా ఈ వివక్షకీ గురికాకుండా ఈ దేశంలో బతకగలిగింది. ప్రపంచంలో ఇన్ని సంప్రదాయాలను ఇంత అవలీలగా ఇముడ్చుకుంటూ, అదే సమయంలో తన సంప్రదాయాల్ని పోగొట్టుకోకుండా ఇతరుల నుంచి మంచిని స్వీకరించి తన ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ఆత్మవిశ్వాసంతో బతికిన జాతి మరొక్కటి లేదు. అందుకే తెచ్చిపెట్టుకున్న గౌరవం కాదు.. నిజమైన ఆత్మగౌరవంతో గుండె లోతుల్లో నుంచి వచ్చిన ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతకొచ్చు.. బతకాలి... అదే వివేకానందుడు మళ్లీ మళ్లీ చెప్పారు.

అలాగే జాతి నిర్మాణాన్ని చూసుకుంటే, అసాధారణ ప్రయోగాల్ని మనం చేయగలిగాం. ఇది సామాన్యమైన విషయం కాదు. ఇటలీలో ఒకే మతం, ఒకే భాష, ఒకే చరిత్ర, ఒకే సాహిత్యం, ఒకే సంప్రదాయం ఉన్నా తొమ్మిది రాజ్యాలను కలపటానికి 1848 నుంచి 23 ఏళ్ల కఠోర దీక్ష అవసరమైంది. కింగ్ లియోపార్డ్ 2, గారిబాల్డి, మాజినీ అసమాన పోరాటాలు చేశారు. అలాగే జర్మనీలో బిస్మార్క్ రక్తపాత ఉక్కు సంకల్పంతో దేశాన్ని




ఏకం చేయగలిగాడు. అదే మనదేశంలో 540కి పైగా సంస్థానాలను ఎన్నో కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు, సంప్రదాయాలు, జాతులు, ఆచారాలు ఉన్నా మొత్తాన్నీ కేవలం 15 మాసాల్లో హైదరాబాద్ సంస్థానంలో కొన్ని ఘటనలు మినహా తుపాకీ తూటాలు పేల్చకుండా మనం ఏకం చేయగలిగాం. ప్రపంచ చరిత్రలోనే అపూర్వమిది. ప్రపంచ చరిత్రలో అలవోకగా ఓ జాతి నిర్మాణం ఎక్కడా జరగలేదు. పొరుగున ఉన్న శ్రీలంకనే చూస్తే రెండు భాషల వారి మధ్య 40 ఏళ్ల పాటు నరమేధం జరిగింది. ఇప్పుడిప్పుడే కూడగట్టుకుంటున్నారు. అలాగే పాకిస్తాన్–బంగ్లాదేశ్, కెనడా, బెల్జియం.

హింసలేకుండా, ద్వేషం లేకుండా, అందరికీ అవకాశాలు కల్పిస్తూ, అందరినీ ఇముడ్చుకుంటూ జాతి నిర్మాణం చేయాలంటే, మనం పిరికిపందల్లా పారిపోకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి. అదే వివేకానంద చెప్పింది. బలమే జీవితం, బలహీనతే మరణం. పిరికిపందలతో మనం జాతి నిర్మాణం చేయలేము, సమస్యను ఎదుర్కోలేము. బలహీనులతో, అర్భకులతో దేశాన్ని బతికించలేము. బలం కావాలి, మానసిక బలం కావాలి, శారీరక బలం కావాలి, చాతుర్యం కావాలి. గాల్లో దీపం పెట్టి దేవుడా, దేవుడా అని పూజ చేస్తే దేవుడు వచ్చి

రక్షించదు. వివేకానందుడు మళ్లీమళ్లీ తన జీవితమంతా చెప్పిందదే. దేవుడి గురించి పెద్దగా మాట్లాడడాయన. జీవితంలో ఆయన మనిషిని గూర్చే మాట్లాడారు. ఈ జాతిని గూర్చి మాట్లాడారు. నా మటుకు నాకు, దేవుడున్నాడో లేడో తెలీదు గానీ, పాపం ఉందని నమ్ముతాను. పుట్టుకతో వివక్షను చూపుతూ ఎదిగే అవకాశాలు అందివ్వకపోవటం, నివారించదగ్గ బాధలు ఈ సమాజం చేస్తున్న ఘోరపాపాలు. ఈ దేశంలో కొంతమంది ఉత్సాహంతో, ఆత్మస్థైర్యంతో ప్రపంచమంతా విజయబావుటా ఎగరవేస్తుంటే, కోట్లమంది కేవలం వారు పుట్టిన తల్లి గర్భం కారణంగా, తెలివితేటలుండి కూడా వికసించే అవకాశం లేక, పుట్టిన కులం వల్లో, కుటుంబం వల్లో... ఎందుకీ గడ్డ మీద పుట్టించావు దేవుడా అని ప్రతిరోజూ ఆక్రోశిస్తున్నారు. వివేకానందుడు మళ్లీ మళ్లీ చెప్పిందదే. కాలే కడుపుకి అన్నం పెట్టకుండా, నిరుపేదకి ఆనందాన్ని పంచకుండా దేవుడ్ని గూర్చి మాట్లాడే అర్హత నీకు లేదు అన్నాడాయన. మానవ సేవే మాధవ సేవ అని మళ్లీమళ్లీ చెప్పారు. ఈ కోట్ల మందికి ఎదిగే అవకాశాల్ని కల్పించకపోతే, ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా, తల్లిదండ్రులకు డబ్బున్నా లేకపోయినా.. నేను ఈ దేశంలో అందరితో సమానంగా ఎదగగలను, ఎవరితోనైనా పోటీ పడగలను, నాకున్న జ్ఞానసంపదను పదిమందికీ పంచగలను, పదిమంది కష్టాలు తీర్చగలను, పదిమంది సుఖాలను పెంచగలను అనే విశ్వాసాన్ని ప్రతి బిడ్డకూ కలిగించలేకపోయినట్లయితే వివేకానందుడికి మనం వారసులం కాజాలం. అలాగే నివారించదగ్గ బాధలను మన వ్యవస్థ కొనసాగించటం వల్ల అనేకమంది అనారోగ్యంతో, బాధలతో, నిరంతర పేదరికంతో ఆక్రోశిస్తున్నారు.

మన వేల సంవత్సరాల ప్రస్థానంలో, భారతీయ సంప్రదాయంలో మహాపండితులు ఎందరో ఉండివుండవచ్చు. కానీ వివేకానందుడి ప్రభావం ఎందుకు కొనసాగుతోందీ అంటే, ఆయన జ్ఞానాన్ని మనిషి సమస్యల పరిష్కారం కోసం ఎలా ఉపయోగించాలో చూపెట్టారు కాబట్టి. జ్ఞానసంపదని సమాజానికి పనికివచ్చే విధంగా మలచకపోతే అది కేవలం శుష్కమైన పండితచర్చగా ఉంటుంది తప్ప ప్రజలకు పనికిరాదు, జాతి నిర్మాణానికి ఉపయోగపడదు.

వ్యక్తికి, సమాజానికి మధ్య సంబంధాన్ని మనం అన్వేషించకపోతే జీవితం నిస్సారమవుతుంది. తన జీవితమంతా వివేకానందుడు బోధించింది అదే. ఐన్‌స్టీన్ ఒక సందర్భంలో చెప్పాడు.. 20వ శతాబ్దంలో మనం సాధనలో పరిపూర్ణత్వాన్ని సాధించాం, కానీ లక్ష్యాల్ని మర్చిపోయాం. పుస్తకాలను బట్టీపట్టి మార్కులు తెచ్చుకోవటంలో ఫస్ట్, కానీ ఆ జ్ఞానం ఎందుకో తెలియదు. నానాగడ్డి తిని, నానాతంటాలు పడి ప్రమోషన్ తెచ్చుకోవటంలో ఫస్ట్, కానీ ఆ ఉద్యోగం వచ్చాక ఏం చేయాలో తెలీదు. కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు కొనేసి, అన్ని అబద్ధాలు చెప్పి, రాత్రింబవళ్లు హంగామా చేసి అధికారంలోకి వచ్చాక, ఎందుకయ్యా అధికారం అంటే... ఈ ప్రశ్న అడుగుతున్నావేమిటయ్యా? ఇప్పటిదాకా తట్టలేదు అంటారు. లక్ష్యాలు మరచిపోయిన సాధన పనికిరాదు. వ్యక్తి సుఖం, సమాజ హితం కలిసి పనిచేస్తుండాలి. వ్యక్తిని, సమాజాన్ని విడిగా చూసినట్లయితే, ఆ సమాజానికి, వ్యక్తికి అపారమైన హాని జరుగుతుంది. ఒక హిబ్రూ రుషి అన్నట్టు, 'నా కోసం నేను పోరాడకపోతే మరెవరు పోరాడతారు? నా కోసమే నేను పోరాడుతుంటే నేనెందుకు?'. మీ కల నెరవేర్చుకోవటం కోసం, మీ ఆశ నెరవేర్చుకోవటం కోసం, మీరు ఉన్నతులుగా ఎదగటం కోసం మీరు పోరాడకపోతే ఇంకెవరు పోరాడతారు? ఖచ్చితంగా పోరాడాలి. ధైర్యంగా పోరాడాలి, నిజాయతీగా పోరాడాలి. అదే సమయంలో సమాజ హితం కోసం కూడా పోరాడాలి. కానీ దీని కోసం వివేకానందుడిలా పెద్ద త్యాగాలు అవసరంలా. మీ జీవితాల్ని మీరు చూసుకుంటూ కూడా కొంత సమయం సమాజం కోసం కేటాయించాలి. నిజాయతీగా మార్పు కోసం కృషి చేయాలి. మన చుట్టుపక్కల వారిని కుట్టిన దోమలు మనల్ని కూడా కుడతాయి. మనం సాధారణ వ్యక్తులమా, ప్రధానమంత్రా అని దోమలు చూడవు. గాలిలో దీపం పెట్టి దేవుడా, దేవుడా అని ఆశపడకుండా, ఎలాంటి మార్పు కావాలో అర్థం చేసుకుని, దాని కోసం సంఘటితంగా పోరాడాలి.

సోవియెట్ యూనియన్ ఉన్నప్పుడు ఆ దేశంలో ఆకలితో అలమటించినవారు, ఎదిగే అవకాశాలు లేక అణచివేతకు గురైనవారు అనేకమంది ఉన్నారు. చివరికి 1991లో మార్పు వచ్చినా ఆ దేశంలో ఒక నాగరికత స్తంభించిపోయింది. ఒక ఆధునిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఒడిదుడుకుల మధ్యే కూడగట్టుకుంటున్నారు. ఈదేశం కూడా ఎక్కడికీ పోదు, కానీ మనకున్న సమయాన్ని దుర్వినియోగం చేసి దుష్పరిపాలననే కొనసాగించుకుంటే, కొన్ని తరాలపాటు అనవసరమైన సంక్షోభాల్లో కొట్టుమిట్టాడతాం. కోట్లమంది సోదరీసోదరులు తీవ్రంగా నష్టపోతారు. అలాంటి కష్టాల్ని అనుభవించకుండా మనల్ని మనం రక్షించుకోవాలంటే, ఆకాంక్షిస్తున్న ఔన్నత్యాన్ని త్వరగా పొందాలంటే, మన జీవితాల్ని సార్థకం చేసుకోవాలి అంటే, కులం, మతం, ప్రాంతం మర్చిపోయి విజ్ఞతతో ఏం కావాలో అర్థం చేసుకుని, మంచి విద్యను సాధనంగా చేసుకుని, మౌలికమైన మార్పుల కోసం సంఘటితంగా కృషి చేయాలి. హిందూ మతాన్ని తాలిబనీకరించే చర్యలతో కాకుండా, ఇలాంటి జాతి నిర్మాణంతోనే వివేకానందుడి కలల్ని నెరవేర్చగలం. ★

# చదువిట్లా.. ఇక మీరు చెబుతున్న అభివృద్ధి ఎట్లా ప్రధానిగారూ !

రాజ్యాంగవే మన పవిత్ర గ్రంథం అని రాజ్యాంగదినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటు సాక్షిగా చెప్పారు గానీ, ఆ మాటల్ని ఆచరణలోకి తెచ్చేందుకు అనివార్యమైన విద్యావ్యవస్థను మాత్రం పట్టించుకోవటం లేదు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ బోధనల్ని కొన్నయినా చెప్పగలుగుతున్న భారతీయ విద్యార్థులు ఈ దేశానికి దిశానిర్దేశం చేసే రాజ్యాంగం గురించి కనీస స్థాయిలో కూడా చెప్పలేకపోతున్నారని తాజా సర్వేలో తేలింది. నివారించదగ్గ బాధలను తొలగించేందుకు, పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డా తన సామర్థ్యాన్ని వికసింపచేసుకునే అవకాశాల్ని కల్పించేందుకు కావలసిన సంస్కరణల కోసం రెండు దశాబ్దాలుగా లోక్‌సత్తా చేస్తున్న కృషి ఎంత సవాలుతో కూడినదో, దీర్ఘకాలికమైనదో మరోమారు రుజువు చేస్తున్న ఈ దురదృష్టకర వివరాల్ని జాతీయ విద్యాపరిశోధనామండలి (ఎన్‌సీఈఆర్‌టీ) బైటపెట్టింది. మన విద్యాప్రమాణాలను, విద్యాహక్కు చట్టాన్ని సవాలు చేస్తున్న ఈ వాస్తవాల్ని దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 6,722 పాఠశాలల్లో 1,88,647 విద్యార్థులను పరీక్షించి తేల్చారు.

మనదేశంలోని ప్రాథమిక విద్య పిల్లలకు ఏమేరకు పరిజ్ఞానాన్ని అందిస్తోందో తెలుసుకునేందుకు నిర్వహించిన ఈ సర్వే ప్రకారం, 8వ తరగతి విద్యార్థుల్లో 70శాతం మందికి దేశ స్వతంత్ర పోరాటం గురించి తెలియదు. 55శాతంమంది సుప్రీంకోర్టు కూడా భారత పార్లమెంటులో అంతర్భాగమనుకుంటున్నారట. స్వతంత్ర పోరాటంలో స్వదేశీ ఉద్యమాన్ని ఎందుకు ప్రారంభించారో 69 శాతం మంది చెప్పలేకపోయారు. బ్రిటీషు అత్యాచారాలు, జనరల్ డయ్యర్ ఆదేశంతో జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతం గురించి కేవలం 45శాతం విద్యార్థులకే తెలుసు. వలస పాలనకు ముందు మనదేశంలో ఐరోపా దేశాల కంపెనీలు ఎందుకు విస్తరించాయో 48శాతం పిల్లలే చెప్పగలిగారు. బ్రిటీషువారు బెంగాల్‌ను చేజిక్కించుకున్నారని 44శాతానికే తెలుసు. 1857 సిపాయిల తిరుగుబాటు ఏయే ప్రాంతాలకు విస్తరించిందో పటంలో 41శాతం మాత్రమే గుర్తించగలిగారు. ఈ తిరుగుబాటులో పాల్గొన్న పాలకుల గురించి 72శాతం మంది వివరించలేకపోయారు. ఇక స్వతంత్ర భారత పాలనకు సంబంధించి రాజ్యాంగం, రాష్ట్రపతి పాలనపై అసంఖ్యాక




విద్యార్థులకు కనీస పరిజ్ఞానం లేదు. రాష్ట్రాల్లో పాలన విఫలమైనప్పుడు రాష్ట్రపతి పాలన విధించటం గురించి కూడా తెలియదు. భారతదేశంలోని ప్రధాన నదుల పేర్ల గురించి 50 శాతం విద్యార్థులకు తెలియదు. బతకటానికి వాతావరణంలో ఆక్సిజన్ ఎందుకు అవసరమో 50శాతం వివరించలేకపోయారు.

ప్రామాణికమైన అసర్ (విద్యావార్షిక స్థితి) సర్వేలు, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అంతర్గత సర్వేలు, ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య తర్కం, విశ్లేషణ, లెక్కలతో పీసా సర్వే కూడా దాదాపు ఇదేతరహాలో అధ్వాన్న విద్యా ప్రమాణాల గురించి బైటపెట్టాయి. 74 దేశాల మధ్య నిర్వహించిన పీసా సర్వేలో మనదేశం 73వ స్థానంలో ఉంది. ఆ తర్వాత ఇక సర్వేలోనే పాల్గొనబోమంటూ పలాయనం చిత్తగించింది. అలాగే 'అసర్' సర్వే ఈ వాస్తవాల్ని గత పదేళ్లుగా దిగజారుదు విద్యాప్రమాణాల గురించి హెచ్చరిస్తూనే ఉంది. మూడో తరగతి విద్యార్థులో సుమారు 60శాతానికి ఒకటో తరగతి పాఠం చదవటం రాదు. అయిదో తరగతివారిలో మూడొంతులమందికి భాగాహారాలు రావు. పది వరకు అంకెల్ని గుర్తించలేని రెండవ తరగతి వారి సంఖ్య గత ఐదేళ్లలో 20శాతానికి విస్తరించింది అని అసర్ సర్వేల్లో తేలింది. ఇక ఉపాధికి కావలసిన నైపుణ్యాల కొరత గురించి చెప్పనక్కర్లేదు. వివిధ కోర్సుల్లో ఉన్న యువతలో 50 నుంచి 80శాతం మందికి నైపుణ్యాలు లేవని పలు సంస్థలు ధృవీకరిస్తున్నాయి. ఈ వాస్తవాలన్నిటినీ చెబుతూ విద్యాప్రమాణాల పెంపు కోసం లోక్‌సత్తా ఎప్పటినుంచో పోరాడుతోంది. అందరికీ మంచి చదువును రాజకీయాలకు కేంద్రబిందువు చేయటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఆ లక్ష్యసాధన కోసం ఇంకా చాలా మైలురాళ్లు దాటాల్సిన రాజకీయ వాతావరణమే ఇంకా కొనసాగుతోంది. ★

# మార్కెట్లు తమంతట తాము సమాజాన్ని మార్చలేవు, ప్రజల్ని పౌరులుగా తయారుచేయటానికి భారతదేశ విద్యావ్యవస్థ, మీడియా మారాలి

## - ప్రముఖ అమెరికన్ ప్రజా తత్వవేత్త మైఖేల్ శాండల్-

**మార్కెట్లు తమంతట తాము సమాజాన్ని మార్చలేవని, భారతదేశంలో విద్య, మీడియారంగాల్లో మౌలిక మార్పులు వస్తేనే జనం జీవితాలు మెరుగుపడతాయని సుప్రసిద్ధ అమెరికన్ రాజకీయ తత్వవేత్త, హార్వర్డ్ యూనివర్సిటీ ఆచార్యుడు మైఖేల్ శాండల్ అన్నారు. ఇటీవల ముంబయిలో టైమ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న శాండల్.. జీవేష్ మోహన్‌కిచ్చిన ఇంటర్వ్యూలో భారతదేశం ఏమాత్రం ఆలస్యం చేయకుండా గుర్తించాల్సిన కొన్ని లోతైన పరిశీలనల్ని అందించారు:**




**టైమ్స్ ఆఫ్ ఇండియా: 'న్యాయం' (జస్టిస్)పై మీ ఆన్‌లైన్ కోర్సుని ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చూస్తుంటారు. అందరికీ విద్యను అందించటంలో ఇంటర్‌నెట్ పాత్రపై మీ అభిప్రాయం?**

శాండల్: ఉన్నత విద్యావకాశాల్ని అందించటంలో ఆన్‌లైన్ బోధన ముఖ్యమైన అవకాశం. న్యాయంపై శిక్షణా తరగతుల ద్వారా ఈ ప్రయోగాన్ని చేశాం. పూర్తి ఫలితాల్ని చూడాలి.

తాత్విక విషయాలపై ప్రసంగాలను చూడటానికి ప్రపంచవ్యాప్తంగా అన్ని లక్షలమంది ఎదురుచూస్తుంటారని నేను కలలో కూడా ఊహించలేదు. స్పందన చాలా ఆశ్చర్యం కలిగించింది.

ఉన్నత విద్య ప్రైవేటు సొత్తుగా కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చేయటంలో ఇంటర్‌నెట్ గొప్ప సాధనంగా ఉపయోగపడుతుంది.

**మార్కెట్ల నైతిక పరిమితుల గురించి మీరు చెబుతుంటారు. అవయవ దానం వంటి విషయాల్లో. మార్కెట్లు స్వీయ విలువలతో సమాజంలో నైతికతను పెంపొందించలేవా?**

మార్కెట్లు వాటంతటవి ఆ పని చేయలేవు.

సమాజంలో సంపదని, అభివృద్ధిని పెంచటానికి మార్కెట్లు గొప్ప ఉపకరణాలు. కానీ న్యాయబద్ధ సమాజాన్ని వాటంతటవే నిర్మించలేవు.

ఆర్థిక శక్తులు సామాజిక జీవనాన్ని శాసించకుండా, ప్రజలు కేవలం వినియోగదారులుగా కాకుండా పౌరులుగా వ్యవహరించేలా చేయటానికి.. మార్కెట్లను ప్రజాస్వామిక వ్యవస్థల పరిధిలో ఉంచాలి. ప్రజల్ని పౌరులుగా తయారుచేయటం నాణ్యమైన విద్య, హేతుబద్ధ చర్చలకు అవకాశం కల్పించే మీడియా ద్వారా మాత్రమే సాధ్యం.

**నిర్మాణాత్మక బహిరంగ చర్చ ప్రజాస్వామ్యానికి మూలం అంటున్నారు. కానీ రాజకీయ నాయకులు కులం, మతం, ప్రాంతం వంటి ఓటుబ్యాంకులను తయారుచేసే భారతదేశంలో మంచి ప్రమాణాల బహిరంగ చర్చకు ప్రజల్ని ఎలా సన్నద్ధుల్ని చేయగలం?**

ప్రజల్ని నిజమైన ప్రజాస్వామ్యానికి సన్నద్ధం చేయటంలో చదువు, మీడియా చాలా ముఖ్య పాత్ర పోషిస్తాయి.

యువతీయువకులను సత్తా గల పౌరులుగా తయారు



చేసేలా విద్యావ్యవస్థ ఉండాలి. ఇందుకోసం చరిత్ర, రాజకీయాలు, ప్రజాస్వామ్యం వంటి పాఠాలను బోధించటంతో పాటు హుందాతనం, పరస్పర గౌరవంతో కూడిన సంభాషణ, చర్చ వంటి అలవాట్లను పెంపొందించాలి.

రెండోది, మీడియా ఒకరి మీద ఒకరు అరుచుకునే కుస్తీ పోటీల్లాంటి చర్చలు చేయకుండా హేతుబద్ధ చర్చలకు వేదికగా ఉండాలి. ప్రస్తుతం భారతదేశ మీడియా అంత గొప్పగా ఉందని నేననుకోవటం లేదు.

కాబట్టి ప్రజల్ని నిర్మాణాత్మక బహిరంగ చర్చలకు సిద్ధం చేసే బాధ్యతను నెరవేర్చటానికి భారతదేశంలో విద్యావ్యవస్థ, మీడియా సమూల మార్పులతో సిద్ధమవ్వాలని భావిస్తున్నాను.

**అర్థ బలం, కుటుంబ, వంశపారంపర్య రాజకీయాల ద్వారా అధికారంలోకి వస్తున్నవారి గురించి మీరు చెబుతుంటారు. ఇవి రెండూ భారతదేశానికి కూడా పెనుసవాలుగా తయారయ్యాయి. ఇందుకు సంబంధించి?**

అవును, అవి రెండూ ప్రమాదాలే. జవాబుదారీతనంలేని ఆ రెండు రకాల అధికారానికీ ప్రత్యామ్నాయాలు కనుగొనాలి.

అధికారంలోకి రావటమనేది.. డబ్బు, మీ తల్లిదండ్రులెవరు అనే వాటి మీద ఆధారపడి ఉండటానికి వీల్లేదు.

**ఈవేళ్టి భారతదేశం ఎలా ఉందనుకుంటున్నారు? మెరుగైన ప్రజాస్వామ్యం కావటానికి మేము ఏం చేయాలి?**

నేను భారత్‌కి రావటం ఇది ఐదోసారో, ఆరోసారో. ఇక్కడి సమాజంలోని ఉత్సాహం, కలుపుగోలుతనం, చైతన్యపూరిత వాతావరణం నాకు అచ్చెరువు గొలుపుతుంటాయి. ఇక్కడి ప్రజల్లోని అంతర్గత ప్రజాస్వామ్య స్ఫూర్తి చాలా శక్తిమంతమైంది. ఇవన్నీ చూశాక భారత్ సవాళ్లని అధిగమిస్తుందనే విశ్వాసం, ఈ దేశ భవిష్యత్తు పట్ల గొప్ప ఆశ నాకు కలిగాయి.

**యువతీయువకులను సత్తా గల పౌరులుగా తయారుచేసేలా విద్యావ్యవస్థ ఉండాలి. ఇందు కోసం చరిత్ర, రాజకీయాలు, ప్రజాస్వామ్యం వంటి పాఠాలను బోధించటంతో పాటు హుందాతనం, పరస్పర గౌరవంతో కూడిన సంభాషణ, చర్చ వంటి అలవాట్లను పెంపొందించాలి. రెండోది, మీడియా ఒకరి మీద ఒకరు అరుచుకునే కుస్తీ పోటీల్లాంటి చర్చలు చేయకుండా హేతుబద్ధ చర్చలకు వేదికగా ఉండాలి. ప్రస్తుతం భారతదేశ మీడియా అంత గొప్పగా ఉందని నేననుకోవటం లేదు.**

భిన్న వర్గాల, సంస్కృతుల ప్రజల మధ్య పౌరసత్వ భావనను, భారతదేశం అనే దృక్పథాన్ని నిర్మించటం ఇప్పుడు ఒక భారతీయ బహుళత్వ సమాజం ముందున్న ముందున్న పెద్ద సవాలు. వీటితోపాటుగా పేదరికం, అవినీతి కూడా భారత్‌కు పెద్ద అవరోధాలుగా కొనసాగుతున్నాయి.

ఈ సవాళ్లను అధిగమించి భారతదేశం బలమైన ప్రజాస్వామ్యంగా కూడా తయారై మిగిలిన ప్రపంచానికి ఓ ఆదర్శంగా నిలుస్తుందని నాకు నమ్మకముంది. ★

# డబ్బు ప్రవాహాన్ని ఆపకపోతే ముందుముందు ఎన్నికల నిర్వహణా కష్టం, సంస్కరణలే శరణ్యం: సీఈసీ

పంచాయితీ వార్డు నుంచి లోక్‌సభ దాకా మనదేశంలో ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో అత్యధికులు తమ ఎన్నికల వ్యయాన్ని తక్కువగా చేసి చూపుతున్నారని భారత ఎన్నికల ప్రధానాధికారి నసీం జైదీ అన్నారు. రాజకీయ నిధుల నియంత్రణకు చట్టాలు అరకొరగా ఉండటం వల్ల ముందుముందు ప్రమాదకర పరిస్థితి తలెత్తవచ్చని హెచ్చరించారు. డబ్బు ప్రభావం విచ్చలవిడిగా మారిపోయి, సంబంధిత సంస్థలు ఆ ప్రభావానికి లోనై ఎన్నికల్ని నిర్వహించటం కూడా కష్టం కావచ్చన్నారు. పైగా రాజకీయ పార్టీలకు వచ్చే నిధులపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ లేదని, దీనివల్ల కొన్ని నిధులు ఎవరికీ కనిపించనవి ఉంటున్నాయన్నారు. ఎన్నికలలో డబ్బు ప్రభావాన్ని తగ్గించే సంస్కరణలకు ఇదే సరైన తరుణమన్నారు. లెక్కలు లేని కార్పొరేట్ విరాళాలు వచ్చి పడుతున్నాయని, దానివల్ల ఎన్నికలు డబ్బుమయంగా మారుతున్నాయని, ఇవి ఎక్కడ్నుంచి వస్తున్నాయో నిగ్గుతేల్చటం కష్టమవుతోందని అన్నారు. రాజకీయ పార్టీలకు ఎలక్టొరల్ ట్రస్టులు ఇస్తున్న విరాళాలు పెరుగుతూనే ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయని, వాటికి లెక్కలు ఉండేలా చూడటమే సవాలని ఓ అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతూ అన్నారు.



రాజకీయ పార్టీలకిచ్చే విరాళాల్లో పారదర్శకత కోసం ప్రధాన పార్టీలను ఒప్పించి లోక్‌సత్తా చేసిన కృషితో 2003లో విరాళాలకు పన్ను రాయితీలు కల్పించే చట్టం వచ్చింది. దీనివల్ల నల్లధనం లేకుండా రాజకీయం చేసే అవకాశం మొట్టమొదటిసారిగా ఏర్పడింది. లోక్‌సత్తా, అదే బాటలో ఆమ్ ఆద్మీ పార్టీ రాగలిగాయి. అయితే ఈ ఒక్క సంస్కరణే చాలదని, ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ఫస్ట్-పాస్ట్-ద-పోస్ట్ ఎన్నికల వ్యవస్థ, మనదేశానికున్న సంక్లిష్ట భిన్నత్వం వంటి వాటి వల్ల ఎన్నికల్లో నల్లధనం పెరుగుతూనే ఉందని, అందువల్ల దామాషా ఎన్నికల వ్యవస్థ వంటి సంస్కరణల్ని కూడా తీసుకురావాలని లోక్‌సత్తా వాదిస్తోంది. ★

# ప్రతిభ గలవారిని రాజకీయాల్లో ప్రోత్సహించాలి, నేను మాత్రం రాను: అజీమ్ ప్రేమ్‌జీ

దేశంలో పేదరికం ఎక్కువగా ఉండటం, నిధుల పంపిణీలో అవకతవకలు చోటుచేసుకోవటం, చాలామందికి ఫలాలు అందకపోవటమే తనను దాతృత్వంవైపు మళ్లించాయని ఐటీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీ అన్నారు. ఎక్కువమంది భారతీయులు తమ సంపదను కేవలం తమ పిల్లలకు అందించాలని భావించటం వల్లే అమెరికాకంటే దాతృత్వంలో మనం వెనకబడి ఉన్నామన్నారు. అయితే వ్యక్తిగతంగానే కాకుండా వ్యవస్థీకృతంగా విస్తృత స్థాయిలో సమాజాన్ని బాగుచేసే అవకాశమున్న రాజకీయాలలోకి తాను రాలేనన్నారు. ఐఐఎంబీయూఈలో జరిగిన ఓ నాయకత్వ సదస్సులో ప్రేమ్‌జీ మాట్లాడుతూ, రాజకీయాల్లోకి నేనెందుకు రాలేదు? అని ప్రశ్నించుకున్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చి ఉంటే రెండేళ్లలోనే అవి తనను చంపేసేవేమోనన్నారు. రాజకీయాల్లో సున్నితత్వం పనికిరాదన్నారు. అయితే మంచి రాజకీయాలు మన అభివృద్ధికి ఎంతో అవసరమని, ప్రతిభ గలవారు రాజకీయాల్లోకి, ప్రభుత్వంలోకి రావటాన్ని ప్రోత్సహించాలని అన్నారు. "అయితే ఎంతమంది మానసికంగా సిద్ధపడి రాజకీయాల్లోకి వస్తారన్నదే ప్రశ్న. సరైన వ్యక్తులు రాకపోతే రాజకీయాలను, ప్రభుత్వ ప్రమాణాలను ఎలా మెరుగుపరుచుకోగలం?" అని ప్రశ్నించారు. వ్యక్తిగత స్థాయిలో తాము భారీ స్థాయి ప్రాజెక్టులను చేపడుతున్నా అవి అట్టడుగు వర్గాలకు చేరటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ★



# ఐదేళ్లలో రూ. 50,000 కోట్ల మెతుకు కుంభకోణం

పత్తి రైతుల నుంచి దళారీలతో తక్కువ ధరకు కొనుగోళ్లు జరిపి మద్దతు ధరకు కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపి సుమారు రూ.1000 కోట్ల రైతుల సొమ్మును 2014-15 సీజన్‌లో అధికారులు, రాజకీయ నేతలు కొల్లగొట్టటం, అక్రమాలు నిగ్గుతేలినా ఎవరి మీదా చర్యలు లేకపోవటాన్ని రైతుసంఘాలు, లోక్‌సత్తా బైటపెట్టినా ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించలేదు. దొంగలముఠాలా ప్రభుత్వాలు పనిచేస్తుండటం వల్ల రైతులు, పేదలు ఎంత భయంకరంగా నష్టపోతున్నారో తాజాగా 'కాగ్' నివేదిక మరోమారు వెల్లడించింది. ఈసారి బియ్యం కుంభకోణం. ఇది ఏకంగా రూ.10లక్షల కోట్ల కుంభకోణమని, గత ఐదేళ్లలోనే రూ.50,000 కోట్లు కొల్లగొట్టారని తేల్చింది. ఈ కుంభకోణంపై ఒడిషాకు చెందిన సహ చట్ట కార్యకర్త గౌరీశంకర్ జైన్ 2012లో కాగ్‌కు ఫిర్యాదు చేశారు.

పార్లమెంటుకు సమర్పించిన కాగ్ నివేదిక ప్రకారం, రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరకు నిరుపేదలకు అందజేసే బియ్యం కోసం ధాన్యం సేకరణ, మరపట్టించే ప్రక్రియలో ఈ లక్షల కోట్లను కొల్లగొట్టారు. చాలాప్రాంతాల్లో బియ్యాన్ని అసలు సరఫరా చేయకుండానే మిల్లర్లు దాచేసుకున్నారు. భారత ఆహార సంస్థ కూడా తన పరిధి కాదన్నట్టు మౌనం వహించింది. దీంతో, కేంద్ర ప్రభుత్వం మీద ఆహార సబ్సిడీ భారం పెరిగింది. 2009 ఏప్రిల్ నుంచి 2014 మార్చి వరకు ధాన్యం సేకరణ, మిల్లింగ్ లావాదేవీలకు సంబంధించి కాగ్ ఆడిట్ నిర్వహించినప్పుడు నివ్వెరపరిచే నిజాలు బైటపడ్డాయి. సబ్సిడీ బియ్యం కోసం వరి ధాన్యం సేకరణ, మరపట్టించే ప్రక్రియలో రూ.40,564.14 కోట్ల మేర 9 కేసులలో అవకతవకలు జరిగినట్టు వెల్లడించింది. ఇక చిన్నచిన్న కేసులలో మరో 10,000 కోట్లు నిగ్గు తేలలేదు. నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా, అసలు రైతేనే అని కూడా పరిశీలించకుండా, ధృవీకరణలు లేకుండా రైతులకు సుమారు రూ.18,000 కోట్ల మేరకు మద్దతు ధర చెల్లించేశారు. రైస్ మిల్లర్లకూ అనుచిత లబ్ధి చేకూరిందని కాగ్ ఆరోపించింది.

తప్పనిసరి తనిఖీలు లేకుండా రూ.21,115.13 కోట్ల వరి ధాన్యాన్ని కనీస నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎలా సేకరించిందో స్పష్టత లేదని కాగ్ ఆక్షేపించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్‌లలో మిల్లర్లు




వరి ఊక, తవుడు వంటి ఉప ఉత్పత్తుల అమ్మకం విలువ బాగా పెరిగినప్పటికీ మిల్లింగ్ ఛార్జీలను మాత్రం 2005 నుంచి సవరించకుండా ఉండటాన్ని కాగ్ ఎత్తి చూపింది. దీంతో, మిల్లర్లు ఉప ఉత్పత్తుల విక్రయం ద్వారా రూ.3,743 కోట్ల రియలైజేషన్ పొందగలిగారు. ఈ రియలైజేషన్ విలువ కంటే వాస్తవ విలువ మరింత ఎక్కువ. రైతుల భూములకు సంబంధించి ధృవీకరణ పత్రాలేవీ లేకుండానే లావాదేవీలు జరిగాయి. ఇన్ని లాభాలు పొందినప్పటికీ మిల్లర్లు బియ్యాన్ని భారీ మొత్తంలో సరఫరా చేయలేని కాగ్ పేర్కొంది. తెలంగాణ, బీహార్, ఒడిషా, హర్యానా, పంజాబ్, యూపీల్లోని ఎంపిక చేసిన కొన్ని జిల్లాల్లో రూ.3,042.87 కోట్ల విలువైన 15.89 లక్షల టన్నుల వరిధాన్యం, మరపట్టిన బియ్యం ఎఫ్‌సీఐ/ఎస్‌జీఏలకు మిల్లర్లు సరఫరా చేయలేదు. ఇక రూ.4,527.91 కోట్ల విలువైన 23.34 లక్షల టన్నుల లెవీ బియ్యం పరిస్థితీ అదే. మిల్లర్ల నుంచి పూచీకత్తు లేకపోవటంతో ఎఫ్‌సీఐ/ఎస్‌జీఏ డబ్బును తిరిగి పొందేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ పథకానికి సంబంధించి ఈస్థాయి అవకతవకలున్నా ఇప్పటిదాకా ప్రక్షాళన చేసి నిబంధనల్ని రూపొందించే చర్యలు లేవు. ప్రస్తుతమున్న ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియలు, విధివిధానాల్ని పునర్వ్యవస్థీకరించాలని, మద్దతు ధర మొత్తాలను రైతుల ఖాతాలకే నేరుగా ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని కాగ్ సూచించింది.

ఈ నివేదికపై కూలంకషంగా అధ్యయనం చేసి సూచనలిచ్చే బాధ్యతను ట్రాఫిక్ కమిషన్‌కి కేంద్రప్రభుత్వం అప్పగించింది.

పారిశుద్ధ్య పథకాల అమలు తీరును కూడా కాగ్ తప్పు పట్టింది. ప్రణాళిక రూపకల్పనలో లసుగులు, నిధుల మళ్లింపు, అవకతవకలు, అనవసర వృధాలు ఉన్నాయని తెలిపింది. ★

# హరిత విప్లవ రాష్ట్రంలో బద్దలవటానికి సిద్ధంగా వ్యవసాయ సంక్షోభం

హరిత విప్లవ రాష్ట్రం పంజాబ్ లో రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. బద్దలవటానికి సిద్ధంగా ఉన్న ఈ సంక్షోభానికి మిగతా రాష్ట్రాల్లోలాగే ఇక్కడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన తప్పుడు వ్యవసాయ విధానాలే ప్రధాన కారణం. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అక్కడి రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక పరిష్కారాల్ని చూపించటం లేదు గానీ, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో లబ్ధి పొందటానికి పన్నాగాలు పన్నుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ)-బీజేపీ కూటమి ఏరకమైన తాయిలాలతో గట్టెక్కాలా అని ఎత్తులు వేస్తుండగా, అధికారాన్ని చేజిక్కించుకోవటానికి రైతుల కన్నీరునే ఇంధనంగా వాడుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్ విన్యాసాలు చేస్తున్నాయి. వ్యవసాయ రుణమాఫీ రైతుల సంక్షోభానికి పరిష్కారం కాదని కేంద్ర ప్రభుత్వం స్వయంగా పార్లమెంటులోనే ప్రకటించినా, తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రుజువైనా కూడా పంజాబ్‌లో రైతులకు ఏకకాల రుణమాఫీని అమలు చేయాలని ముఖ్యమంత్రి ప్రకాష్ సింగ్ బాదల్ ఇటీవల పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని కోరారు. ఒకప్పుడు మిగులు బడ్జెట్‌లో ఉన్న పంజాబ్ రాష్ట్రం ప్రజలకు ఎదిగే అవకాశాల మీద కాకుండా తాత్కాలిక తాయిలాల మీద దృష్టి పెట్టి ఓట్ల వేటలో ఇష్టమొచ్చినట్టు ఉచిత పథకాలను అమలు చేసింది. లెక్కాపత్రం లేని ఉచిత విద్యుత్తు, అనర్హులకు రేషన్ వంటి కార్యక్రమాలతో ఖజానా ఖాళీ అయింది, పేదలు పేదలుగానే మిగిలిపోయారు, రైతులు మళ్లీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. మార్కెట్ సంస్కరణలు లేకుండా గోధుమ సేకరణను కేంద్రప్రభుత్వం పరిమితం చేసుకోవటంతో రైతులకు న్యాయమైన ధర లభించే వ్యవస్థ కరవైంది. ఆదాయం కరవవటంతో దుర్భర పరిస్థితులు ఆవరిస్తున్నాయి. ముఖ్యమంత్రి కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఉప ముఖ్యమంత్రిగా ఉండటం, కోడలు హరిసిమ్రత్‌కౌర్ బాదల్ కేంద్రంలోని మోదీ సర్కారులో మంత్రిగా ఉండటం, అధికార పార్టీ నేతల పురుగు మందుల కుంభకోణం, డేరా సచ్ సౌదా నేత గుర్‌మీత్ రామ్ రహీమ్ కౌర్‌కు క్షమాభిక్ష విషయంలో ఎస్ఏడీ నేతృత్వంలోని అకల్‌తఖ్త్ వ్యవహారశైలికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగినప్పుడు శాంతిభద్రతల విషయంలో సర్కారు వైఫల్యం తదితరాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నిద్రాణంగా ఉన్న అసంతృప్తి వ్యవసాయ సంక్షోభంతో తీవ్రస్థాయికి చేరుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభం పంజాబ్ సంక్షోభం బద్దలైతే మరింత తీవ్రతరమయ్యే అవకాశముంది. ★




**ఒకప్పుడు మిగులు బడ్జెట్‌లో ఉన్న పంజాబ్ రాష్ట్రం ప్రజలకు ఎదిగే అవకాశాల మీద కాకుండా తాత్కాలిక తాయిలాల మీద దృష్టి పెట్టి ఓట్ల వేటలో ఇష్టమొచ్చినట్టు ఉచిత పథకాలను అమలు చేసింది. లెక్కాపత్రం లేని ఉచిత విద్యుత్తు, అనర్హులకు రేషన్ వంటి కార్యక్రమాలతో ఖజానా ఖాళీ అయింది, పేదలు పేదలుగానే మిగిలిపోయారు, రైతులు మళ్లీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు.**

### కొత్తదనం, తర్కం, పరిష్కారం, వ్యక్తిగత విజయం, వ్యవస్థల నిర్మాణం

# ఇవే యువ మంత్రాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్



లోక్‌సత్తా భావాల్ని కనీసం ఇప్పుడంటే దేశవ్యాప్తంగా మాట్లాడుతున్నారు అనుసరించే ప్రయత్నం చేస్తున్నారుగానీ, ప్రజాస్వామ్య సంస్కరణల కోసం లోక్‌సత్తాని ప్రారంభించినప్పుడు అదేదో అర్థంకాని భాషగానే ఎక్కువమంది అనుకునేవారు. ఇదంతా జరిగేనా అన్న భావనే అన్ని చోట్లా వినిపించేది. లోక్‌సత్తా మాటల్ని ఇప్పటిలాగే అందరూ ఎంతో ఆర్తితో, నిండుమనసుతో వినేవారు, అందరి మనసుల్లోనూ ఇది జరిగితే బాగుండును అనే బలమైన ఆకాంక్ష ఉండేది.. కానీ ఈ భావాలకు తగిన వ్యవస్థను తయారుచేయటం దగ్గరికొచ్చే సరికి ఎవర్ని కదిలించినా నిరాశే. ఇలాంటి పరిస్థితుల మధ్య దీర్ఘకాల పోరాటమని తెలిసే లోక్‌సత్తాను ఇరవయ్యేళ్ల క్రితం ప్రారంభించాను. 100కోట్ల పైచిలుకు ప్రజల జీవితాల్ని, అందులోనూ ప్రపంచంలో ఎక్కడాలేనంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో మార్పు వ్యవస్థీకృతంగా తేవటమంత సవాలు ఇంకోటి ఉండదు. మరి కేవలం ఏదో ఒక కలగని ఆ కలను నెరవేర్చటం కోసం గుడ్డిగా పోరాటం చేశానా? ముందువెనకా చూసుకోకుండా దూకేశానా?.. ఖచ్చితంగా కానే కాదు. నేను మొదలుపెట్టింది పూర్తిగా ఆచరణ సాధ్యమైన కల. భారతదేశం తన సామర్థ్యానికి తగ్గట్టు అభివృద్ధి చెందకుండా చేస్తున్నది ప్రకృతి వైపరీత్యాలు, విదేశీ హస్తాలు కాదు, కేవలం మన పాలకుల పాపం, సమాజం నిర్లక్ష్యం వల్లే ఈదేశం తీవ్రంగా నష్టపోతోందని స్పష్టమైన అవగాహనతోనే పరిష్కారోద్యమాన్ని ప్రారంభించాను. భారత్ ముందున్న అమూల్యమైన సమయం యధాతథంగా గడిచిపోయి కొన్ని తరాలు నష్టపోయే ప్రమాదాన్ని నివారించటానికే ఈ పోరాటం. పౌరసమాజ పరంగానా, పార్టీ పరంగానా, పార్టీలకతీతమైన రాజకీయ పోరాటమా - ఏమార్గమన్నది పట్టించుకోలేదు. చట్టవిరుద్ధం, అనైతికం కానంతవరకూ మార్గం ఏదైనా లక్ష్యాన్ని సాధించి కోట్లాదిమందికి నివారించదగ్గ బాధలను తొలగించి, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను అందించాలనేదే నా లక్ష్యం.

లోక్‌సత్తా కృషి మంచిదే కానీ అదంతా జరిగేది కాదు, ఎక్కడో విదేశాల్లో జరిగిన పురోభివృద్ధి మనదేశంలో అసాధ్యం అని ఎంతోమంది ప్రముఖులు, ఆలోచనాపరులు నిరుత్సాహపరిచినా వెనక్కితగ్గకుండా నా మార్గంలో వెళ్లటానికి, అది ఆచరణ సాధ్యం అనుకోవటానికి ప్రధాన కారణం- అపార సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఈ దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న యువతీయువకులే. అందుకే ఎప్పుడు అవకాశమున్నా యువతీయువకులతో మాట్లాడటం, వారితో వీలైనన్ని ఆలోచనల్ని పంచుకోవటం, పరిష్కారాలు చూపటం చేస్తుంటాను. ఎన్ని సమస్యలున్నా, నిర్దిష్ట పరిష్కారాలు చూపుతూ ధైర్యంగా సమస్యలను ఎదుర్కొనే యువతను దేశవ్యాప్తంగా లోక్‌సత్తా తయారుచేయగలిగింది. వ్యవస్థీకృత పరిష్కారంలో భాగమైన అలాంటి యువతీయువకుల సంఖ్యను పెంచాలనే ఆశతోనే జాతీయ యువజన దినోత్సవాన్ని కూడా వారితో భావాల్ని పంచుకునే ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాను.

నాకు చాలా చేయాలని ఉంది, ఏదో చేద్దామనుకున్నా అడ్డం కొడుతున్నారు, ఉత్సాహాన్ని నీరుగారుస్తున్నారు, మంచి చేయటం కంటే మౌనం మేలు, మనకెందుకు అనిపిస్తోంది, నేనొక్కడినే, నేనొక్కదాన్నే ఏం చేయగలను? అని చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు తరచూ అడుగుతున్నారు. కాస్త మంచి చదువు, అవకాశాలు ఉన్నవారి నుంచి కూడా ఇదే ప్రశ్న ఎదురవుతోంది. 50ఏళ్ల ముందు సైతం ఇలాంటి ప్రశ్న వచ్చేది కాదు. దేశం

**దేశానికి ఏదో చేద్దామనుకునేవారు ఎలా ఉపయోగపడాలో తెలియక విసిగిపోయేటువంటి సిగ్గుమాలిన వ్యవస్థల్ని మనం తయారుచేసుకున్నాం. 41 ఏళ్లుగా నేను భారతదేశంలో మార్పు కోసం పోరాటాన్నే తింటున్నాను, తాగుతున్నాను, నిద్రపోతున్నాను, కలగంటున్నాను, జీవిస్తున్నాను. నా అనుభవం నుంచే ఈ ప్రశ్నకు జవాబిస్తాను.**

ఏదోకమేర అభివృద్ధి సాధించాక కూడా ఇలాంటి ప్రశ్న వస్తుండటం చాలా దురదృష్టకరం. దేశానికి ఏదో చేద్దామనుకునేవారు ఎలా ఉపయోగపడాలో తెలియక విసిగిపోయేటువంటి సిగ్గుమాలిన వ్యవస్థల్ని మనం తయారుచేసుకున్నాం. 41 ఏళ్లుగా నేను భారతదేశంలో మార్పు కోసం పోరాటాన్నే తింటున్నాను, తాగుతున్నాను, నిద్రపోతున్నాను, కలగంటున్నాను, జీవిస్తున్నాను. నా అనుభవం నుంచే ఈ ప్రశ్నకు జవాబిస్తాను.

నా జీవితంలో ముగ్గురు గొప్ప భారతీయులున్నారు. వారిని హీరోలుగా భావిస్తాను. మొదటి హీరో, డాక్టర్ రజనీకాంత్ అరోలీ. ఈయన నలభై, యాభై ఏళ్ల క్రితమే గ్రామాలలో, అటవీ ప్రాంతాలలో తక్కువ వ్యయంతో అందరికీ మంచి వైద్యారోగ్యాన్ని అందించటం ఆచరించి చూపారు. ఆయన చేసిన కృషిని ఒక వ్యవస్థలాగా మార్చుకోవటంలో మనం దారుణంగా విఫలమయ్యాం. మంచి చేసేవారిని వినియోగించుకోలేని దౌర్భాగ్య వ్యవస్థని తయారుచేసుకుని కొనసాగిస్తున్నాం. ఇక రెండో వ్యక్తి, వర్గీస్ కురియన్. సహకార రంగంలో పాల విప్లవం తీసుకొచ్చి ఈదేశ రైతులకి, ఇతర పేద, మధ్యతరగతికి ఆదాయాన్ని, నిజమైన స్వతంత్ర జీవితాన్ని అందించారు. మూడోవారు, ఇటీవల మరణించిన శరద్ జోషి. వ్యవసాయంలో కొత్త ఆలోచనల్ని, కొత్త భాషని తీసుకొచ్చి ఒక విప్లవాత్మకమైన మార్పు కోసం తపించారాయన. ఆయన ఆలోచనల్ని వినియోగించుకుని ఉంటే అత్యధిక శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని ఈపాటికి చక్కదిద్దుకుని ఆర్థికశక్తిగా రూపుదిద్దుకునేవాళ్లం. కానీ మన లేకి, ఫ్యూడల్ సమాజం ఆయన్ని అణగదొక్కి, అవమానించి, ఆలోచనల్ని విసిరేసింది. ఆ ముగ్గురి భుజాల మీద నిలబడ్డాను కాబట్టే, నేను ఆ మూడు రంగాలలో వారి కంటే ఎక్కువ చేయగలిగాను. జాతీయ ఆరోగ్య మిషన్‌కు నాంది పలికా. అందరికీ నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం అందుబాటులోకి తేవటాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నా. ప్రభుత్వ జోక్యం లేకుండా ప్రజలు సంఘాలుగా ఏర్పడి తమ కార్యకలాపాలు నిర్వహించునేందుకు కురియన్ స్ఫూర్తితో సుమారు పదేళ్లు కృషి చేసి చట్టబద్ధత కల్పించా. ఒక్క ఎంపీ లేకపోయినా, అందుకోసం 97వ రాజ్యాంగ సవరణ తీసుకురాగలిగా. అలాగే గత ఐదారేళ్లలో ఆహారధాన్యాల ఎగుమతులపై నిషేధాన్ని తొలగించేలా చేసి రైతులకు ఆదాయాన్ని మెరుగుపరచగలిగా. పప్పుధాన్యాల దిగుమతులపై సుంకం విధించి మన రైతులకు ప్రోత్సాహకాలిచ్చి స్వయంసమృద్ధి సాధించేలా చేయాలని పోరాడా. ఇలా కొన్ని గణనీయ ఫలితాలను ఇప్పటికే సాధించగా, మరికొన్ని కొంత సమయం పట్టే దశలో ఉన్నాయి. అందుకే నా అనుభవం నుంచి మీకు చెప్పేదిదే. మీరు మీ ముందు తరం భుజాల మీద ఉన్నారు. వారి కంటే ఎక్కువ సాధించాలనుకోవాలి తప్ప ఈరోజు కంటే గతమే మేలు అని నిరాశ పడొద్దు.

నాకు మంచి చేసే అవకాశం అసలు ఎవరూ ఇవ్వటం లేదు అనటం ట్రాష్. మీ ముందు తరాల కంటే ఎక్కువ సాధించే అవకాశం మీకు ఎప్పుడూ ఉంటుంది. మీరు కెరీర్‌లో ఎదుగుతూ, వ్యక్తిగతంగా సుఖపడుతూ, చుట్టూ ఉన్న సమాజానికి కూడా ఎలా మేలు చేయాలో ముందు అర్థం చేసుకోవాలి.

అందుకు మీరు సృజనాత్మకతతో, తర్కబద్ధంగా ఆలోచిస్తూ, ఒక క్రమ పద్ధతిలో పరిష్కారంలో భాగమవ్వాలి. రొమాంటిసిజం లేకుండా, డాంబికాలకు పోకుండా విషయాల్ని లోతుగా అర్థం చేసుకుని ధైర్యం, సామర్థ్యం, ఆలోచన, ఒప్పించే ఓపిక, నాయకత్వ లక్షణాలతో పనిచేయటం మొదలుపెట్టాలి.

ఈ దేశానికి నేనేదో చేయాలి అనుకుంటున్న లక్షలాది చదువుకున్న యువతీయువకులకు ముందు తమ బతుకుతెరువు గురించి స్పష్టత ఉండాలి. మరీ ఎక్కువ విషయాలలోకి వెళ్లి అన్నిటిలో గెలవాలనుకోవద్దు. అది సాధ్యం కూడా కాదు. మనకు వీలున్న, ఇష్టమైన విషయాల్ని ఎంచుకుని, ఏకాగ్రతతో, పట్టుదలతో, పరిష్కారాల పట్ల అవగాహనతో పనిచేయటం మొదలుపెట్టాలి. తమ జీవితాన్ని తాము చూసుకుంటూ దేశంలో మార్పు తెచ్చేందుకు తనకున్న వనరుల్ని, సమయాన్ని ఫలితాలు సాధించేలా నైపుణ్యంతో ఉపయోగించాలి. అందుకు ముందుగా ఈదేశ పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలి.

ఈదేశంలో చాలామందికి ఒక రొమాంటిక్ ఆలోచన ఉంది. పల్లెలు స్వర్గధామాలని, చదువుకున్నవారు వ్యవసాయంలోకి పెద్దసంఖ్యలో వెళ్లాలని చాలామంది పూర్వకాలంలోలాగా ఆలోచిస్తుంటారు. అది తప్పని ముందుగా అర్థం చేసుకోవాలి. అది మంచా, చెడా అనేది కాదు చర్చ. ఈదేశం ఆ దశను దాటేసింది. మన చేతిలో ఉన్న పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలంటే ముందు మనం రొమాంటిసిజం నుంచి బైటపడి ఈ వాస్తవాల్ని అర్థం చేసుకోవాలి. మనం వ్యవసాయానికి విత్తనాల దగ్గర్నుంచి స్వేచ్ఛా మార్కెట్ వరకూ అన్నీ చేసినా రైతును

**ఈదేశంలో చాలామందికి ఒక రొమాంటిక్ ఆలోచన ఉంది. పల్లెలు స్వర్గధామాలని, చదువుకున్నవారు వ్యవసాయంలోకి పెద్దసంఖ్యలో వెళ్లాలని చాలామంది పూర్వకాలంలోలాగా ఆలోచిస్తుంటారు. అది తప్పని ముందుగా అర్థం చేసుకోవాలి. అది మంచా, చెడా అనేది కాదు చర్చ. ఈదేశం ఆ దశను దాటేసింది. మన చేతిలో ఉన్న పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలంటే ముందు మనం రొమాంటిసిజం నుంచి బైటపడి ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి.**

కనీసం బతికించగలం తప్ప మిగతావారితో పోటీపడగల ప్రామాణిక ఆదాయాన్ని అందించలేం. దేశ జనాభాలో 55శాతంగా ఉన్న వ్యవసాయదారుల ఆదాయం 14-15శాతంకాగా, మిగిలిన 45శాతం ఆదాయం 85శాతంగా ఉంది. ఎంత భయంకర అంతరం! వ్యవసాయాన్ని బాగుచేయటానికి లోక్‌సత్తా చెప్పిన విధానాలను అమలుచేస్తూనే, వ్యవసాయం మీద ఆధారపడినవారి సంఖ్యను భారీగా తగ్గించాలి. అందుకు ఇతర రంగాలలో ఉద్యోగాలనిచ్చేలా ఆర్థికవ్యవస్థను పెంచాలి. అయితే అందరూ ఇప్పుడున్న పట్టణాలకు తరలిరావటం పరిష్కారమా? అంటే కానే కాదు. దేశంలో ఉన్న 6,00,000 గ్రామాలను పట్టణాలుగా మార్చటం సాధ్యంకాదుగానీ, కొన్ని గ్రామాలకు ఆర్థిక కేంద్రాలుగా 10,000 చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం పరిష్కారం. అలాగే వంశపారంపర్య రాజకీయాలు, మనోడే వంటి ఆశ్రిత పక్షపాతాలు, ఎవరైనా నిష్పక్షపాతంగా ఉంటే వాడికి టెక్కు పెరిగిపోయింది అంటూ ద్వేషించటాలు ఇవన్నీ ఫ్యూడల్ సమాజం నుంచి ఆధునిక వ్యవస్థ రూపొందేటప్పుడు అనివార్యంగా ఉండేవి. వీటిని తొలగించటానికి తగిన వ్యవస్థల్ని నిర్మించుకోవాలి. అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలను పాలనకు కేంద్ర బిందువు చేయటంతోపాటు, చిన్న పట్టణాలను వేగంగా అభివృద్ధి చేయాలి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ (పీఎం-సీఎం-డీఎం) మధ్యే కేంద్రీకృతమైన అధికారాన్ని కిందిస్థాయికి తెచ్చి జనానికి పంచాలి. నిర్ణయాలలో ఎక్కువమందికి, చిట్టచివరి పౌరులకి కూడా అవకాశం కల్పించాలి. తమ వీధిలో, వార్డులో సమస్యలు ప్రజలు పరిష్కరించుకునే ఏర్పాటు చేయాలి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో చాలామందికి తమ ఊరే స్వర్గం. 90శాతం పనులు అక్కడే పూర్తవుతాయి. ఆ ఊరు మహానగరమేమీ కాదు. గ్రామసీమే. కానీ ఆ ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాలన్నీ అక్కడే ప్రజల భాగస్వామ్యంతోనే జరుగుతాయి. చిన్న విషయాలే కావచ్చు, కానీ ఆ నిర్ణయాలలో పాల్గనేవారి సంఖ్య చాలా ఎక్కువ ఉంటుంది. ప్రజలకు పరిపాలన, తాము పన్నుల రూపంలో చెల్లించే డబ్బుకు మధ్య సంబంధం అర్థమై, తమ కోసం తాము ఏం చేయాలో ఆలోచించటం ఉంటుంది.

ఇలాంటి శక్తిమంతమైన పౌరులు ప్రధానమంత్రి కన్నా ముఖ్యమైనవారు. నేనేం చేయాలి? అని ఆలోచించే యువతకు ఏం చేయగలరో చెప్పే మార్గమిది. ఈ మార్గాన్ని వ్యవస్థీకృతం చేసే రాజకీయాన్ని మనం తెచ్చుకోవాలి.

ప్రధాని, ముఖ్యమంత్రి, కలెక్టర్ తప్ప మిగిలినవారికి భాగస్వామ్యం లేదంటే, ఈదేశంలో మహామేధావులు, నాయకత్వ లక్షణాలున్నవారు, సమాజాన్ని మార్చే శక్తిగలవారి సామర్థ్యమంతా వృథా అయిపోయి దేశం తీవ్రంగా నష్టపోతుంది. అందుకే అందరి శక్తిసామర్థ్యాలూ దేశానికి ఉపయోగపడేలా పనిచేసేందుకు కావలసిన ఈ వ్యవస్థను నిర్మించుకోవటం మనకు చాలా అవసరం.

ఇలాంటి అధికార వికేంద్రీకరణ, స్థానిక పాలన ఉంటే నక్సలైట్లు కూడా ఉండరు. వాళ్లకు మనం చెప్పొచ్చు- ఎందుకయ్యా, పిచ్చివాళ్లలా చంపుతూ, చావటం. వచ్చి మీ ఊరుని బాగుచేసుకోండి అని. నక్సలైట్లలో చాలామంది ఏదో పెద్ద సైద్ధాంతిక చైతన్యంతో వచ్చినవాళ్లు కారు. తమ ప్రాంతంలో ఏదో స్థానిక సమస్య పరిష్కారంలో దెబ్బతిని ఆ మార్గంలోకి వెళ్లినవాళ్లు. వాళ్లకి స్థానికంగా పరిష్కారాలకు పనిచేసే అవకాశమిస్తే 98శాతంమంది తిరిగొచ్చేస్తారు. కులం, మతం, ప్రాంతం, ఉచితాలు, తాయిలాల రాజకీయం కూడా తగ్గుతుంది.

మీరు ఇలా పౌరసత్వం కలిగిన వారుగా స్థానికంగా నాయకత్వాన్ని అందిస్తుంటే, మీ ముందు తరం వారి కంటే కూడా గొప్ప కృషిని అందించగలుగుతారు. జ్ఞానానికి విభజనలు లేవు, కానీ మన యూనివర్సిటీల్లో కులం గురించి అడగటం ఈ జాతి సిగ్గుపడాలి. నార్మన్ బోర్లాగ్ భారతీయుడు కాదు, ఇక్కడి మతస్తుడు కాదు, కులస్తుడు కాదు. అయినా ఈ దేశం ఆహార కొరత నుంచి బైటపడాలని నిరంతరం కృషి చేశారు. వందల కోట్ల మందిని ఆకలిచావుల నుంచి కాపాడి ఇరవయ్యే శతాబ్దపు గొప్ప వ్యక్తులలో ఒకరుగా మిగిలారు. కుల వివక్షను ఖచ్చితంగా గుర్తించాలి. మీ కులమేంటో, నేపథ్యమేంటో తెలిస్తే చాలామట్టుకు ఖచ్చితంగా పుట్టినప్పుడే మీ జాతకం చెప్పేయచ్చు కాబట్టే ఈదేశంలో జ్యోతిష్కులు తామరతంపలా పెరిగిపోతున్నారు. కానీ కులవివక్షని నిర్మూలించే పరిష్కారంలో భాగం కాకుండా ఇంకా పెంచే విధంగా వ్యవహరించటాన్ని ఖచ్చితంగా తిరస్కరించాలి. నాకు న్యాయం జరగాలంటే ఇతరులకు ఖచ్చితంగా నష్టం జరగాల్సిందే అనే పాతకాలపు జీరో సమ్ ఆలోచనా ధోరణి నుంచి యువత బైటపడాలి. రిజర్వేషన్లు వంటి విషయాల్లో కూడా

**కులవివక్షని నిర్మూలించే పరిష్కారంలో భాగం కాకుండా ఇంకా పెంచే విధంగా వ్యవహరించటాన్ని ఖచ్చితంగా తిరస్కరించాలి. నాకు న్యాయం జరగాలంటే ఇతరులకు ఖచ్చితంగా నష్టం జరగాల్సిందే అనే పాతకాలపు జీరో సమ్ ఆలోచనా ధోరణి నుంచి యువత బైటపడాలి.**

అందరినీ సమన్వయం చేస్తూ న్యాయం చేసే పరిష్కారాలను ఆలోచించటం మొదలుపెట్టాలి. వేల ఏళ్లుగా అణగారిన వర్గాలకు అండగా నిలిచేందుకు ఇప్పుడున్న రిజర్వేషన్లను కొనసాగిస్తూనే, వారిని శత్రువులుగా చూస్తున్న మిగిలిన కులాల్లో పేదలకు కూడా అవకాశాలనిచ్చేందుకు మార్గాలను అన్వేషించాలి. గ్రామీణ, చదువులేని తల్లిదండ్రుల పిల్లలకు అదనంగా కొన్ని మార్కులు కలపటం వంటి పరిష్కారాలను పరిశీలించాలి. నిజానికి రిజర్వేషన్ల వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు, కానీ తరతరాలుగా అణచివేతకు గురైనవాళ్లకు కొంతైనా ఉపశమనం కలిగిస్తూ వారితో కలిసి వారి సమస్యలకు, అంతిమంగా మొత్తం సమాజం సమస్యలకు శాశ్వత పరిష్కారాలు వెతకటం ముఖ్యం. మన పరిష్కారాలు అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు. కానీ 80శాతమందికి నచ్చేలా హేతుబద్ధంగా, న్యాయంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉండటం చాలా అవసరం. అలాంటి నాయకత్వ స్థాయిని ఈదేశ యువత అందుకోవాలి.

మీరు గత మూడునాలుగేళ్ల పరీక్ష పేపర్లను బట్టీపట్టి ఎన్ని మార్కుల సంపాదించుకున్నారు, ఎంత పెద్ద ర్యాంకు తెచ్చుకున్నారు అనేవి నాకనవసరం. మీకెంత పెద్ద ఉద్యోగం వచ్చింది, ఐఏఎస్, ఐపీఎస్ అయ్యారా, ఇంకోటయ్యారా అనేది కూడా నేను పట్టించుకోను. అవి పెద్ద అంశాలు కూడా కాదు. నిజమైన చదువున్నవారు ఆర్థిక వ్యవస్థను పెంచే రాజకీయాన్ని, పాలనని బలోపేతం చేస్తూ, ఆత్మగౌరవంతో బతకటానికి కావలసిన ఆదాయాన్నిచ్చే ఉద్యోగాన్ని నైపుణ్యంతో సంపాదించుకునే శక్తిని కలిగివుంటారు. గత 20 ఏళ్లుగా నాకు ఏ పదవీ లేదు. ఐదేళ్లు శాసనసభ్యునిగా ఉన్నా, అది అవసరానికి ధరించిన దుస్తుల్లాంటిదే. నేను మాట్లాడే మాటల్లో మీకు పనికొచ్చే అంశాలు లేకపోతే, నాకు ఎన్ని డిగ్రీలతో ఎంత గొప్ప బయోడేటా ఉన్నా, ఎన్ని పదవులున్నా ప్రయోజనం శూన్యం. తమ ముందు తరాల నుంచి స్ఫూర్తి పొంది అంతకంటే ఎక్కువ కృషి చేస్తున్నవారు మన దేశంలో కొంతమందైనా ఉన్నారు. అసాధారణ సందర్భాల్లో, అసాధారణ సామర్థ్యంతో, అసాధారణ త్యాగాలు చేసిన నాయకుల నుంచి నిరంతరం స్ఫూర్తి పొందవచ్చుగానీ, వారి లాగా త్యాగాలు చేయాల్సిన అవసరం ఎక్కువమందికి ఉండకూడదు. మిగిలినవారు తమ జీవితాల్ని తాము చూసుకుంటూనే దేశ హితం కోసం పనిచేస్తుండవచ్చు. మీ వ్యక్తిగత రంగంలో చెప్పుకోదగిన విజయం సాధిస్తూనే, మీ పరిధిలో, ఈ దేశంలో ఎలాంటి మంచి మార్పును మీరు తేగలిగారు? అనేదే నాక్కావలసింది.

ఇది చిన్నవని, ఇది పెద్దవని అనుకోకుండా మనం ఎంచుకున్న రంగంలో, మనం ఉన్నచోట, మన సామర్థ్యం మేరకు చిత్తశుద్ధితో పనిచేస్తూ, ఆదాయాన్ని పెంచుకుంటూ ఆత్మగౌరవ భావనతో బతకాలి. జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలి. పాత, ముసలి, బలహీన ఆలోచనల్ని వదిలేసి, యువ, నూతన, పటిష్ట, పరిణతి ఆలోచనల్ని చేయాలి. ఉత్తర ప్రదేశ్‌లో 368 ప్యూను పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే 23 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో లక్షలాది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లతోపాటు పీహెచ్‌డీలు కూడా ఉన్నారు. ఇంకా మనం ప్రభుత్వాలున్నది ఉద్యోగాలివ్వటానికి, అందులోనూ ప్యూను ఉద్యోగాలివ్వటానికే అనుకుంటే చాలా పాతకాలపు ఆలోచనల్లోనే మగ్గుతున్నట్టు. ప్రభుత్వాలున్నది ఉద్యోగాలనిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించటానికి, పెంచటానికి, ప్రభుత్వం విధిగా అందించాల్సిన విద్య, వైద్యం, పోలీసు వంటి సేవలలో ఉద్యోగుల చేత పని చేయించటానికి తప్ప ఉద్యోగాల పేరుతో ప్రజల్ని పనికిమాలినవాళ్లగా తయారుచేయటానికి కాదు. కొంతమంది ఏం చేసినా జీవితానికి ఢోకాలేని ప్రభుత్వోద్యోగులు, మిగిలిన కోట్లాదిమంది నిరంతరం ప్రభుత్వం నుంచి ఏదోకటి యాచించేవారు అనే వ్యవస్థని తయారుచేశాం. దీన్నుంచి బైటపడాలి. మన రాజ్యాంగం అంటే, మనం ఏం చేయాలో లక్ష్యాన్ని నిర్దేశించేది. మనం ఇప్పుడున్న స్థితి నుంచి రాజ్యాంగం నిర్దేశించిన స్థాయికి వెళ్లాలంటే, కొన్ని సాధనాలు, వ్యవస్థలు కావాలి. మనలో అందరం రాజ్యాంగ స్థాయి ఆలోచనకు చేరుకోలేకపోయినా, కనీసం ఆ స్థాయి రావటానికి మన చుట్టూ ఉన్న వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవటం అవసరం. దాంతోపాటు కులాంతర వివాహాలు వంటి సామాజిక సంస్కరణల్లో భాగస్వాములైతే మార్పు మరింత వేగంగా వస్తుంది.

మన జీవితాల్ని, చుట్టూ ఉన్న పరిస్థితుల్ని, దేశాన్ని గురించి కాస్త లోతుగా ఆలోచించి, మనస్ఫూర్తిగా ఇష్టపడుతూ దృఢ సంకల్పంతో, సృజనాత్మకతతో, కొత్తమార్గంలో, పౌరసత్వ భావనతో, సమస్యల్ని పరిష్కరించే ధోరణితో, తగిన వ్యవస్థల నిర్మాణంతో పనిచేస్తే మీరు వ్యక్తిగతంగా సుఖపడతారు, ఈ దేశానికీ మేలు చేయగలుగుతారు. అదే జీవితానికి సార్థకత చేకూర్చే అత్యుత్తమ విజయం. ★

# పొంతన లేని కార్పొరేటర్ల ఎన్నికల ఖర్చు, అనర్హత ఆరేళ్లు ఉండాల్సిందే: లోక్‌సత్తా

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ఎన్నికల ఖర్చుపై గట్టి నిఘా పెట్టాలని, అనర్హత వేటును మూడేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని లోక్‌సత్తా పార్టీ కోరింది.

గత ఎన్నికలలో కార్పొరేటర్లు ఇచ్చిన లెక్కల్లో భారీ అవకతవకలున్నాయని, సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలు ఎన్నికలలో పెట్టిన ఖర్చుకు, చూపిన లెక్కలకు పొంతన లేకుండా ఉందని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన లెక్కలతో లోక్‌సత్తా నేతలు ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డిని కలిసి అవకతవకల్ని వివరించారు. లోక్‌సత్తా సేకరించిన వివరాల ప్రకారం, గెలిచిన 123 మంది (తాజా మాజీ) కార్పొరేటర్ల ప్రచారానికి, ఇతర కార్యక్రమాలకు చేసిన ఖర్చు కేవలం రూ. 1.54 కోట్లు మాత్రమేనట. చిన్నపాటి సభకే కోట్లు ఖర్చు పెట్టే పార్టీలు, ఒక కాలనీలో ప్రచార సభ అలంకరణకే రూ. 2లక్షలు ఖర్చు చేసిన ఒక్కో పార్టీ అభ్యర్థి ఇంత తక్కువ ఖర్చు చూపారు.

53మంది కార్పొరేటర్లకు కాంగ్రెస్ రూ. 61,38,803, 47మంది కార్పొరేటర్లకు తెలుగుదేశం రూ. 46,42,333 ఖర్చు చేశాయని సాంబిరెడ్డి తెలిపారు. 44మంది కార్పొరేటర్లకు ఎంఐఎం రూ. 38,22,649, ఆరుగురు కార్పొరేటర్లకు బీజేపీ రూ. 2,98,782 ఖర్చు చేసినట్టు చూపాయన్నారు. వ్యక్తిగతంగానూ కొందరి వివరాలు నమ్మశక్యంగా లేవన్నారు. ఒకరు రూ. 5,235, మరొకరు రూ. 8,140 మాత్రమే ఖర్చుగా చూపారన్నారు. గతంలో అభ్యర్థులు ఎన్నికల ఖర్చు సక్రమంగా చూపని వైనాన్ని కూడా ఈసీ దృష్టికి లోక్‌సత్తా తీసుకెళ్లింది. అయితే ఇలా చూపనివారు 27మందిని మూడేళ్లపాటు ఎన్నికలలో పోటీకి అనర్హులుగా చేసినా వారు మళ్లీ ఇప్పుడు ఎన్నికలలో పోటీ చేస్తున్నారని, అందుకే ఎన్నికల ఖర్చులో తప్పుడు లెక్కలు చూపనివారందరినీ వెలికితీసి కనీసం 6ఏళ్ల అనర్హత వేటు వేయాలని లోక్‌సత్తా పార్టీ కోరుతోందని తెలిపారు.

బీసీ (వెనకబడిన వర్గాల) గణనలో జీహెచ్ఎంసీ లెక్కలకు, గతంలో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేకగణాంకాలకు భారీ తేడా ఉందనే విషయాన్ని కూడా లోక్‌సత్తా నేతలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ★

# రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : లోక్‌సత్తా

హైదరాబాద్ అల్వాల్‌లో అధ్వాన్నంగా మారిన రోడ్లను మరమ్మతు చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నాయకులు మునిసిపల్ ఉప కమిషనర్ ఎ.రమేష్‌కి వినతిపత్రం ఇచ్చారు. అల్వాల్, వెంకటాపురం తదితర ప్రాంతాలలో మంచినీటి పైప్‌లైన్‌లు, భూగర్భ డ్రైనేజీ పనుల నిమిత్తం రోడ్లపై ఎడాపెడా తవ్వకాలు జరిపారని, వీటిని అలాగే వదిలేయటం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రెడ్డి ఎన్‌క్లేవ్ వద్ద ఓపెన్‌నాలాపై శ్లాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్టీ నేత శ్రీనివాస వర్మ, సన్ని తదితరులు పాల్గొన్నారు. ★



అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లోక్‌సత్తా నాయకులు




(మనదేశంలో ఓట్లు, సీట్లు సంపాదిస్తున్న సాంప్రదాయ రాజకీయ (సాం,రా) పార్టీలు వేలకోట్లు విరాళాలుగా తీసుకుంటూ పాపం లెక్కలు మాత్రం చూపలేకపోతున్నాయి. అవినీతి, నల్లడబ్బుతో సతమతమవుతున్నాయి.)

కర్టెసీ : న్యూస్‌క్లిక్

Posting Date 07-01-2016

RNI.Reg. No. APTEL/2010/32219    Postal Reg. No. HD/1126/2016-18    Published on January 1st 2016


# స్వచ్ఛ భారత్ పేరుతో.. స్వాహా భారత్...

## 4 రోజుల్లో 4 కోట్లు హాంఫట్

హైదరాబాద్ కు వచ్చిన నిధులు 7 కోట్లలో సగానికి పైగా విలాసాలు, ప్రకటనలు, మీటింగులకే ఖర్చు

## రండి ఈ చెత్త రాజకీయాలను ఊడ్చేద్దాం...

## ఈ సారి లోక్‌సత్తా ని గెలిపించుకుందాం....

**లోక్‌సత్తా పార్టీ, గ్రేటర్ హైదరాబాద్**

Hitex లో ముఖ్యమంత్రి గారి మీటింగ్ కు 1.08 కోట్లు.



టోపీలు, టీషర్ట్‌ల కోసం 40 లక్షలు



హోర్డింగ్‌లకు, ఫ్లెక్సీలకు 34 లక్షలు



క్లీనింగ్ మెటీరియల్ కు 21.38 లక్షలు



M.L.A ల పూనే టూర్ కోసం 1 13.78 లక్షలు



అధికారుల తిరగడానికి A.C బస్సుల కోసం 9.18 లక్షలు



స్టేషనరీ సామాన్లకు 4.3 లక్షలు.



www.loksatta.org    /loksatta_party    /loksatta    YouTube


Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To,

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad